మా అక్షరాలు - నిజాల నిప్పు కణికలు
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 64 వెల - రూ 5:00
Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada
శనివారం 25 మే 2024

## ఊరికి తప్పిన ముప్పు

తండా మొత్తంగా విద్యుత్ షాక్



## కిషన్ రెడ్డి మా బ్రాండ్ అంబాసిడర్

- బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక జరిగితే సన్మానిస్తా
- ఆయనకూ వాజ్‌పేయ్ లాగా మంచి గుణాలు ఉన్నాయి
- ప్రధాని మోడీ ఎక్కడికెళితే అక్కడ టోపీ పెట్టేస్తున్నారు
- కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్య

3లో..

## గనుల శాఖలో అవినీతి చెద

ఆరుగురు అధికారులపై వేటు

3లో..



# తెలంగాణ అవతరణ వేడుకలకు ఇసి గ్రీన్ సిగ్నల్

- తెలంగాణ అవతరణ వేడుకలకు ఇసి అనుమతి
- ఘనంగా దశాబ్ది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించి సూచనలు చేసిన సిఎస్
- జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో అవతరణ వేడుకలు
- అనుమతి లభించిన నేపథ్యంలో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖలకు ఆదేశం
- గన్ పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్న సీఎం

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. ఈసీ నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధశాఖల అధికారులను ఆదేశించారు. దశాబ్ది వేడుకలు కావడంతో ధూమ్‌ధామ్‌గా చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో తెలంగాణ ఉద్యమకారులను సిఎం రేవంత్ సన్మానించే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని



నిర్వహించేందుకు ఈసీ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వడంతో, అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. మిగతా 2లో..





## మళ్ళీ వాయిదా కవిత బెయిల్‌పై విచారణ..

న్యూఢిల్లీ, మే 24 (ప్రజామంటలు): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్యే కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ కేసులో వాదనలను సోమవారానికి వాయిదా వేసింది ధర్మాసనం. ఈడీ అరెస్ట్ చేసిన విధానం.. కేసులో కవిత పాత్ర గురించి దర్యాప్తు సంస్థ చెప్పిన విషయాలపై కవిత తరఫున న్యాయవాది కోర్టుకు వివరించారు. దీనికి సంబంధించి ఆదివారం సాయంత్రం లోపు కౌంటర్ కాపీని కవిత న్యాయవాదికి మెయిల్ ద్వారా ఇవ్వాలని ఈడీ, సీబీఐ ని హైకోర్టు ఆదేశించింది. సోమవారం నాడు రెండు కేసుల్లో కవిత తరఫున వాదనలు పూర్తి చేయాలని హైకోర్టు మిగతా 2లో..

## దేశాబివృద్ధికి పాటుపడే వారికి ఓటేయండి

### మేము ఎప్పుడూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### ఏడోదశ ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ పిలుపు

సిమ్లా,మే24 (ప్రజా మంటలు): దేశాభివృద్ధికి పాటు పడే వారికే ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అభివృద్ధి జరగాలనుకునే వారు తప్పకుండా




బీజేపీకి మద్దతు ఇస్తారని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో గతంతో పోల్చితే ఎక్కువ స్థానాల్లోనే బీజేపీ గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఇండియా

## అమిత్‌షాకు లైన్ క్లీయర్ చేస్తున్న మోడీ

### అందుకోసం బిజెపిలో సీనియర్లకు మొండిచేయి

### ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ,మే24(ప్రజా మంటలు): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అమిత్ షాను ప్రధానిని చేయడం కోసం.. ఆ పార్టీలోని సీనియర్ నేతలు శివరాజ్ సింగ్, వసుందర రాజే, ఖతర్ సాహెబ్, డాక్టర్ రమణ్ సింగ్‌లను పక్కన పెట్టారని ఆరోపించారు. నేడో రేపో యూపీ ప్రస్తుత సీఎం యోగి ఆధిత్యనాథ్‌ను సైతం పక్కన పెడతారన్నారు. అందుకు సంబంధించిన ప్రచారం సైతం ఇప్పటికే ప్రారంభ మైందని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో మీడియాకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ మాట్లాడారు. 2019లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేజ్రీవాల్ గుర్తు చేశారు. బీజేపీలో 75 ఏళ్లు వచ్చినా.. ఆ వయస్సు దాటిన నాయకులంతా తప్పకుండా రిటైర్ కావాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారన్నారు. అందులో ఎటువంటి రాజీ లేదని అమిత్ షా చెప్పారన్నారు. కావాలంటే.. నాడు అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు.. ఇంటర్నెట్‌లో చెక్ చేసుకోవచ్చునంటూ కేజ్రీవాల్ సూచించారు. అయితే ఆ రూల్ ప్రకారమే బీజేపీలోని సీనియర్లు ఎల్ కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ తదితరులంతా పార్టీ నుంచి తప్పుకున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో బీజేపీలో ప్రస్తుతమున్న నాయకాగణం సైతం ఆ రూల్ ప్రకారం నడుచుకోవాల్సిందేనని కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 21న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయన తీహాడ్ జైలుకు తరలించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన పార్టీ తరఫున ప్రచారం చేసుకోవాలంటూ సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ వేశారు. నేపథ్యంలో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇటీవల కండిషన్లతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం ఢిల్లీలోని తన పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా బీజేపీ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని కేజ్రీవాల్ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇందులోభాగంగా 2025, సెప్టెంబర్ 17వ తేదీతో ప్రదాని నరేంద్ర మోదీకి 75 ఏళ్లు వస్తాయన్నారు. బీజేపీ పెట్టుకున్న రూల్ ప్రకారం.. 75



ఏళ్లు వచ్చిన వారు రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి ఉంటుదన్నారు. ఆ క్రమంలో మోదీ రిటైర్‌మెంట్ కాక తప్పదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మీ పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరంటూ బీజేపీ నేతలకు సూటిగా కేజ్రీవాల్ సవాల్ విసిరారు. దీనిపై కేంద్ర మంత్రి అమిత్ షా స్పందించారు. మూడోసారి కూడా ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీనే ఉంటారని అమిత్ షా స్పష్టం చేశారు. అటువంటి వేళ.. కేజ్రీవాల్ బీజేపీలో అమిత్ షాను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టేందుకు మోదీ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు.

## ప్రజా నాడి




## బంగ్లా ఎంపి మహమ్మద్ అన్వర్ హత్యలో హనీట్రాప్

### వలపువలలోకి లాగి క్రూరంగా హత్య

### సన్నిహితంగా ఉంటూనే వారే హత్యకు సహకరించిన కొందరు

### అక్రమ విదేశియుడిని అరెస్ట్ చేసిన కోల్‌కతా పోలీసులు

కోల్‌కతా, మే 24 (ప్రజా మంటలు): చికిత్స కోసం పశ్చిమ బెంగాల్‌కు వచ్చి హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ మహమ్మద్ అన్వర్ ఉల్ అనర్ కేసులో మరిన్ని దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఓ మహిళతో ఆయనను వలపు వలలోకి లాగి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఓ అక్రమ వలసదారుడిని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. హత్య అనంతరం మృతదేహాన్ని అదృశ్యం చేసేందుకు నిందితులు దారుణంగా ప్రవర్తించారని తెలుస్తోంది. దానిపై చర్మాన్ని ఒలిచి.. ముక్కలుగా నరికినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అన్వర్ హత్య కేసులో సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. అమెరికాలో నివసించే ఓ మిత్రుడు అద్దెకు తీసుకున్న టౌన్‌హాల్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లోకి ఇద్దరు పురుషులు, ఒక మహిళతో కలిసి వెళ్లిన ఆయన.. ఆ తర్వాత తిరిగిరాలేదని గుర్తించారు. బంగ్లా ఎంపీని ఓ మహిళతో హనీట్రాప్ చేయించి ఆ అపార్ట్‌మెంట్‌లోకి రప్పించి ఉంటారని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతుడి స్నేహితుడికి ఆ మహిళ సన్నిహితురాలే. ఫ్లాట్‌లోకి వెళ్లగానే ఆయనను హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నాం అని బెంగాల్ సీఐడీ అధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటి వరకు ఉన్న ఆధారాలను పరిశీలిస్తే ఎంపీని గొంతునులిమి చంపినట్లు తెలుస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత ఆయన మృతదేహాన్ని ముక్కలుగా నరికి ఉంటారని భావిస్తున్నారు. ఆయన చర్మాన్ని వేరు



చేశారు. దుర్వాసన రాకుండా ఉండేందుకు శరీర భాగాలకు పసుపు కలిపి పెట్టినట్లుగా అనిపిస్తోంది. కొన్ని భాగాలను ఫ్రిజ్‌లో పెట్టినట్లు ప్రాథమికంగా నిర్ధరించాం. అక్కడి నుంచి నమూనాలను సేకరించాం. ఎంపీ శరీర భాగాలను ప్లాస్టిక్ బ్యాగుల్లో తీసుకుని వివిధ ప్రదేశాల్లో పడేసి ఉంటారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి వచ్చిన వలసదారు జిహాద్ హవల్దార్‌ను పోలీసులు ముంబయిలో అరెస్టు చేశారు. మిగతా 2లో..

## హైదరాబాద్‌లో కిడ్నీ రాకెట్

### కేరళ యువకుడి మృతితో రట్టు

### సూత్రధారి ప్రైవేట్ డాక్టర్‌గా గుర్తింపు

హైదరాబాద్, మే 24 (ప్రజామంటలు): నగరంలో మరో అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయ్యింది. కేరళకు చెందిన యువకుడి మృతితో ఆ రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కీలక సూత్రధారి హైదరాబాద్‌కుచెందిన వైద్యుడిగా గుర్తించారు. కొంతకాలంగా పేదలకు డబ్బు ఆశ చూపి విదేశాలకు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేస్తూ దందా సాగిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న యువకుడు మృతిచెందడంతో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## తెలంగాణ అవతరణ వేడుకలకు ఇసి గ్రీన్ సిగ్నల్

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ నున్నట్లు తెలిపారు. సీఎం ముందుగా గన్ పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళు లర్పిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర పారంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తల పించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు.

## మళ్ళీ వాయిదా
## కవిత బెయిల్‌పై విచారణ..

ధర్మాసనం సూచించింది. మంగళవారం నాడు ఈడీ, సీబీఐ వాదనలు వింటామన్నారు న్యాయమూర్తి. అనంతరం కవిత బెయిల్ పిటిషన్లపై విచారణను సోమవారానికి వాయిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. కాగా, సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై శనివారం నాడు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేస్తామని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు.

## బంగ్లా ఎంపి మహమ్మద్ అన్వర్ హత్యలో హనీట్రాప్

ఈ ఘోరంలో అతడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తెలిపారు. ఎంపీని హత్య చేసి ఆయన మృతదేహాన్ని గుర్తించడానికి వీల్లేకుండా ఛిద్రం చేసినట్లు నిందితుడు హవల్దార్ అంగీకరించాడు. ఈ ఘటన వెనుక ప్రధాన సూత్రధారి బంగ్లాదేశ్ సంతతికి చెందిన అమెరికా పౌరుడు అఖ్తరుజమాన్ అని బయటపెట్టాడు. అతడి ఆదేశాలతోనే తాను ఈ పనిచేసినట్లు విచారణలో చెప్పాడు' అని సీఐడీ వర్గాలు వెల్లడించాయి. మహమ్మద్ అనర్ మే 12న కోల్‌కతా శివారులో ఉన్న తన స్నేహితుడి ఇంట్లో బస చేశారు. ఆ మరుసటి రోజు పని ఉందని బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఎంపీ కోసం పోలీసులు విస్తృతంగా గాలించగా.. వారం తర్వాత హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని బంగ్లా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినా.. ఇంతవరకు మృతదేహం దొరకలేదు.

## గనుల శాఖలో అవినీతి చెద
### ఆరుగురు అధికారులపై వేటు

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ గనులు, భూగర్భ శాఖలో అవినీతి ఆరోపణలతో ఆరుగురు అధికారులపై ప్రభుత్వం వేటేసింది. గనుల శాఖలో డిప్యుటేషన్ పై జీఎంలుగా పని చేస్తున్న పాండురంగారావు, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, ప్రాజెక్టు ఆఫీసర్స్ దశరథం, తోట శ్రీధర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లను మాతృ సంస్థలకు బదిలీ చేసింది. అధికారుల అవినీతిపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, ఆక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్ రావును అరెస్టు చేయడం కలకలం రేపిన సంగతి తెలిసిందే.. అంతకుముందు ఫోన్ల ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ ఇన్ స్పెక్టర్ గా పనిచేసిన ప్రణీత్ రావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే అదే కేసులో పోలీసు అధికారులు భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావు అరెస్టయి జైల్లో ఉన్నారు. ఎస్ ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కు రెడ్ కర్నార్ నోటీసులు జారీ కాబోతున్నాయి. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ కేసును తారుమారు చేసేందుకు యత్నించిన పంజాగుట్ట సీఐ దుర్గారావుపై సర్కారు సస్పెన్షన్ వేటు వేసింది. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలించి సంచలన నిర్ణయం తీసుకున్నది. ఠాణా మొత్తాన్ని ట్రాన్స్ ఫర్ చేయడం కలకలం రేపింది.

## ఊరికి తప్పిన ముప్పు

**తండా మొత్తంగా విద్యుత్ షాక్ -ఇళ్ల నుంచి బయటకు జనం పరుగులు**

**కామారెడ్డి జిల్లా పలుగుట్ట తాండాలో ఘటన**



కామారెడ్డి,మే 24 (ప్రజామంటలు): సాధారణంగా విద్యుత్ షాక్‌తో ఒకరిద్దరూ మృతిచెందుతున్న ఘటనలు మనం తరచూ చూస్తుటాం... కానీ గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికీ విద్యుత్ షాక్ వచ్చిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలుగుట్ట తండాలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి ఒక్కసారిగా తండాలోని అన్ని నివాసపు ఇళ్లకు విద్యుదాఘాతం అవ్వడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఒక్కసారిగా ప్రాణభయంతో ఇళ్ల నుంచి పరుగులు తీశారు. ముగ్గురు తండావాసులు ప్రమాదానికి గురికాగా వారిని ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, ఏదో ఒక ఇంటికి కాకుండా గ్రామంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ షాక్ రావడం అధికారుల అలసత్వానికి నిదర్శమని గ్రామస్థులు అన్నారు. అధికారుల తీరుపై వారు మండిపడ్డారు. కొండాపూర్ సబ్ స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. దేవుడి దయతో తామంతా ప్రాణాలతో బయటపడ్డామని, ఒకవేళ తాము మరణించి ఉంటే తమ కుటుంబాల పరిస్థితి ఏంటని కొందరు... స్థానిక అధికారులను ప్రశ్నించారు. మరమ్మతులు త్వరగా చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని లేనిపక్షంలో తమ ఆగ్రహం చవిచూస్తారని గ్రామస్థులు హెచ్చరించారు.

# నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా

**రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం**

**దొంగతనాల నివారణకు నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి**

**జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్**



జగిత్యాల బ్యూరో, మే 24,(ప్రజామంటలు): నేర విచారణ మరింత సమర్ధవంతంగా చేయడంతో పాటు చాలా రోజుల నుండి పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాటిని సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా పని చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాట చేయాలని జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ సూచించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశం లో ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటివరకు నమోదైన కేసు లలో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసు కోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. గుర్తుతెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేయగానే వెంటనే ఫోటోలు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. దీని ద్వారా ఎక్కడైనా మిస్సింగ్ పర్సన్ ఉంటే రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి మిస్సింగ్ కేసు లను ఛేదించవచ్చని సూచించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ యంత్రంగం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని మండలాల్లో, గ్రామాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించాలని అన్నారు. వివిధ జిల్లాల నుండి జిల్లాకు వచ్చే గంజాయి మూలలను,కీలక వ్యక్తులను గుర్తించి వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు..లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయాలకు పాల్పడే విక్రయదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేస్తాము అని తెలిపారు. మరియు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలని సూచించారు. మార్కెట్లో బిటి3 పత్తి విత్తనాలకు ఎలాంటి పర్మిషన్ లేదు అనుమతి లేని విత్తన విక్రయాల దారులవద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచిం చారు. విత్తనా డీలర్లుల వద్ద నే విత్తనాలు కొనుగోలు చేయలని, తప్పనిసరిగా బిల్ అడిగి తీసుకోవాలని తెలిపారు, మరియు గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు.అమే వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు, గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయ వద్దని వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు/వ్యవసాయ అధికారుల కు తెలపాలని లేదా డయల్ 100 కాల్ చేసి తెలిపినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని గారు తెలిపినారు. ఈ యొక్క నకిలీ విత్తనాల నివారణ కోసం స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ యొక్క టీం జిల్లాలో వ్యవసాయ అధికారులను సహాయంతో అన్ని ఎరువుల దుకాణంలో తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ యొక్క సమావేశంలో డీఎస్పీలు రవీంద్ర కుమార్ , రఘు చందర్,ఉమామహేశ్వర రావు,రంగా రెడ్డి, వ్యవసాయ అధికారులు , డి సి ఆర్ బీ, సి సి ఐ, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ , , రఫీక్ ఖాన్, మరియు సి.ఐ లు, ఎస్.ఐ లు, డి సి ఆర్ బి, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి పాటుపడే వారికి ఓటేయండి



కూటమి ఎన్ని కుట్రలు చేసిన వారు అధికారంలోకి రావడం కల.ని ఎద్దేవా చేశారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'హిమాచల్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోవట్లేదు. వారికెప్పుడు వారసత్వ రాజకీయాలు, అవినీతి, అక్రమాలు చేయడంపైనే ధ్యాస ఉంటుంది. సిమ్లాకు రావడం నాకు ఎప్పుడూ ప్రత్యేకమే. కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికో ప్రధాని మారుతారు.కాంగ్రెస్ మతాలు, కులాల మధ్య చిచ్చు రేపి లబ్ది పొందాలని ప్రయత్నిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేసి మైనారిటీలకు ఇవ్వాలని చూస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో అలాగే చేయాలని ప్రయత్నించడంతో కోల్‌కతా హైకోర్టు దీదీ సర్కారుకు మొట్టికాయలు వేసింది. రిజర్వేషన్లను రద్దు చేయాలని ఇండియా కూటమి ప్రయత్నిస్తోంది. వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి. రానున్న ఎన్నికల్లో బీజేపీకి అఖండ విజయాన్ని కట్టబెట్టాలని మోదీ ఓటర్లను కోరారు. ఆరో దశ లోక్ సభ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఆయా పార్టీల అధినేతలు ఏడో దశ ఎన్నికలపై దృష్టి పెట్టారు. దేశ వ్యాప్తంగా జూన్ 1న ఏడో దశ పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్‌లో మోదీ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన ఇవాళే ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న పంజాబ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో మొత్తం 57,11,969 మంది ఓటర్లు ఉన్నారని ప్రధాన ఎన్నికల అధికారి మనీష్ గార్గ్ తెలిపారు. 2019లో 53,30,154 మంది ఉండగా 3,81,815 మంది ఓటర్లు పెరిగారని వెల్లడించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలను కైవసం చేసుకున్న బీజేపీ ఈసారి అన్ని సీట్లల్లో పాగా వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## హైదరాబాద్‌లో కిడ్నీ రాకెట్

ఈ వ్యవహారం బయటకొచ్చింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. కేరళలో ఓ యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి ఈ మధ్యనే కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడని, అందుకు దళారులు రూ.20లక్షలు ఆశ చూపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సబిన్ అనే దళారిని కోచి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకుని విచారించారు. కీలక సూత్రధారులు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్, మరో ముగ్గురు కలిసి దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. యువకుడిని ఇరాన్ తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేశారని, రూ.20లక్షలు ఇస్తామని చెప్పి రూ.6లక్షలే ఇచ్చినట్లు దర్యాప్తులో తేలినట్లు కేరళ పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా కేరళ పోలీసులు హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్, కేరళకు చెందిన 40మంది యువకులను ఇరాన్ దేశం తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువమంది పేదలే ఉన్నట్లు వారు తెలిపారు. నగరానికి చెందిన ఒక వైద్యుడితోపాటు మరో ఇద్దరు దళారుల కోసం కేరళ పోలీసులు వెతుకుతున్నారు. కేరళలోని ఎర్నాకులం కేంద్రంగా వ్యవహారం నడుపుతున్నారని, పేదలను టార్గెట్ చేసుకుని నగదు ఆశ చూపి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని కేరళ పోలీసులు పేర్కొన్నారు



## ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

**జిల్లా ఎస్పి చందనా దీప్తి**



నల్గొండటౌన్, మే 24 (ప్రజామంటలు): వరంగల్ - ఖమ్మం -నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుట కొనుటకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, పోలింగ్ ముందు 48 గంటలు తేది 25-05-2024 సాయంత్రం 4 గంటల నుండి తేది 27-05-2024 పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ ఉంటుందని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.సైలెన్స్ పీరియడ్ లో యం.ఎల్.సి ఎన్నికలకు సంబందించిన సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు లో ఉంటుందని, ఎవ్వరూ 5 గురి కంటే ఎక్కువ గుంపులుగా ఉండ కూడదని అన్నారు.ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే నగదు, మద్యం,ఇతర వస్తువుల రవాణా పై మరింత పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎవరైన ఓటర్లను ఆకర్షించేందుకు ఉచిత పంపిణీలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన పిర్యాదులు సి.విజిల్ ఆప్ ద్వారా పిర్యాదు చేయగలరని అన్నారు. పోలింగ్ కు 48 గంటల ముందు నుండే ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ఇంటింటా ప్రచారం లాంటివి చేయవద్దని అన్నారు.వేరే నియోజక వర్గం నుండి ప్రచారానికి వచ్చిన వాళ్లు స్థానికంగా ఏవ్వరూ ఉండకూడద్దని, లాడ్జ్ లు, గెస్ట్ హౌస్ లు, హెూటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు మరియు రాజకీయ పార్టీ ల వారు తేది 25-05-2024 సాయంత్రం 4 గంటల లోపు ఖాళీ చేసి వెళ్లిపోవాలని అన్నారు.అసెంబ్లీ నియోజక వర్గంలో ఓటు హక్కు లేని వ్యక్తులు బసచేయడానికి వస్తే వారి గురించి సంబంధిత పోలీసులకు తెలియజేయాలి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున, పై నిబంధనలను ఏ పార్టీ వారయిన, ఏ వ్యక్తులయిన ఉల్లంఘించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు


**సమస్యాత్మక కేంద్రాల్లో గట్టి నిఘా**

**అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్**

**జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు**



సూర్యాపేట ప్రతినిధి(ప్రజామంటలు): జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ లో శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళ ఓటర్లు 34176 మంది, పురుష ఓటర్లు 17321 మంది మొత్తం 51497 మంది ఉన్నారని తెలిపారు. 16 రూట్లలో 71పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే 16 సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలోని 71 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపడుతున్నట్లు, 19 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో బయట కూడా వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. 22 పోలింగ్ కేంద్రాల్లో 800 మంది ఓటర్లు ఉండగా అట్టి చోట రెండు జంబో బాక్స్ లు ఏర్పాటు చేస్తున్నామని, మిగతా చోటా జంబో, బిగ్ సైజ్ బాక్స్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 26న పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకుంటారని, 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ ఏజెంట్లను కేంద్రాలకు ముందుగా పంపాలని సూచించారు.అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో మద్యం షాపులు పూర్తిగా బంద్ చేయాలని, సభలు, సమావేశాలు, ప్రచారాలు నిలిపివేయాలని అన్నారు.ఎన్నికల రోజున జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. పోలింగ్ అనంతరం కలెక్టరేట్ రిషప్షన్ సెంటర్లలో అందజేయడం, తదుపరి కౌంటింగ్ నిమిత్తం నల్గొండ దుప్పలపల్లి ఎఫ్సిఐ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కి తరలించడం జరుగుతుందని అన్నారు.అనంతరం ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ 19 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి నిఘా పెంచామని, 16 రూట్లలో గట్టి భద్రత ఏర్పాటు చేశామని, ప్రతి మండలంలో సబ్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరుగకుండా పక్క ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.అంతకు ముందు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ను పరిశీలించి, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను తెలుసుకున్నారు.ఎన్నికల విధులు నిర్వహించే 242 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్.ప్రియాంక, బిఎస్.లత, ఏఎస్పీ నాగేశ్వర రావు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి, అబిద్, సత్యనారాయణ, కోట గోపి, స్టాలిన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు.. తొలిసారి 23వేల ఎగువకు నిఫ్టీ

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. నిన్నటి భారీ లాభాలతో సరికొత్త రికార్డులను నమోదు చేసిన సూచీలు..శుక్రవారం కూడా ఇంట్రాడేలో సరికొత్త గరిష్ఠాలను అందుకున్నాయి. సెన్సెక్స్ 75,636.5 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాలను తాకగా.. నిఫ్టీ తొలిసారి 23 వేలు దాటి 20,026 వద్ద గరిష్ఠాన్ని అందుకుంది. ఆపై సూచీలు దిగువకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలూ ఇందుకు కారణమయ్యాయి.సెన్సెక్స్ ఉదయం 75,335.45 (క్రితం ముగింపు 75,418) పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై.. తర్వాత లాభాల్లోకి వెళ్లింది. ఇంట్రాడేలో 75,244.22 - 75,636.50 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 7.65 పాయింట్ల నష్టంతో 75,410.39 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 10.55 పాయింట్లు కోల్పోయి 22,957.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.10గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టీ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా లాభపడగా.. ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.76 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. ఔన్సు బంగారం ధర 2,340 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఫోన్‌కి అతికించండి.. ట్యాప్ చేయండి..

### పిన్ లేకుండానే ఎంచక్కా పేమెంట్స్

డిజిటల్ చెల్లింపుల్లో కొత్త పద్ధతులు పుట్టుకొస్తున్నాయి.




ఒకప్పుడు లావాదేవీలు జరపాలంటే ఇంటర్నెట్ ఉంటేనే సాధ్యమయ్యేది.ఇప్పుడు యూపీఐ లైట్ ద్వారా డేటా సదుపాయం లేకున్నా పేమెంట్స్ చేసేస్తున్నాం. ఈ చెల్లింపులు జరపాలంటే కచ్చితంగా మొబైల్, దాంట్లో ఛార్జింగ్ ఉండాల్సిందే. అదే మొబైల్ డెడ్ అయిపోయిన సమయంలో పేమెంట్స్ జరపాలంటే? అలాంటి సందర్భంలోనూ చెల్లింపులు జరిపేందుకు వీలుగా కంపెనీ ను తీసుకొచ్చింది. ప్రస్తుతం క్రెడిట్/ డెబిట్ కార్డుల్లో ఉన్న ట్యాప్ అండ్ పే ఫీచర్ తరహాలోనే ఇదీ పని చేస్తుంది.కాంటాక్ట్ లెస్ చెల్లింపులు చేసేందుకు ఇటీవల ఫెడరల్ బ్యాంక్ ఫ్లాష్ పే పేరుతో రూపే స్మార్ట్ కీ చైన్‌ను తీసుకొచ్చింది. తాజాగా ఆ తరహా సేవల్నే ఒక బుల్లి డివైజ్‌తో ఇచ్చేందుకు సిద్ధమైంది నియోగ్రూప్. అనేది ట్యాగ్. పిన్ లేకుండా పేమెంట్స్ జరిపేందుకు సాయపడు తుంది. ఇది చూడటానికి పెద్ద సైజ్ సిమ్ లాగా ఉంటుంది. దీన్ని ఫోన్ వెనక భాగంలో సులభంగా అతికించొచ్చు. ఎక్కడైనా పేమెంట్స్ చేయాలంటే ఫోన్ వెనక ఉన్న స్టిక్కర్ ట్యాప్ చేస్తే సరిపోతుంది. మెట్రో, బస్ ఛార్జీలు, పెట్రోల్ పంప్ పేమెంట్స్ ఇలా అన్నిరకాల చెల్లింపులను జరపొచ్చని కంపెనీ చెబుతోంది. యూపీఐ లైట్ మాదిరిగానే రూ.2 వేల వరకు పేమెంట్స్ చేయొచ్చు. యాప్ ద్వారా కంట్రోల్ చేసే సదుపాయం కూడా ఉంది.సాధారణ యూపీఐ పేమెంట్స్, డెబిట్, క్రెడిట్ కార్డు చెల్లింపుల కంటే సులభంగా ఎటువంటి అంతరాయం లేకుండా లావాదేవీలు జరపొచ్చంటూ కంపెనీ చెబుతోంది. కేవలం 480 మిల్లీసెకన్లలో పేమెంట్స్ చేయొచ్చట. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని పేమెంట్స్ యాప్స్‌లలో ఇదే అత్యంత వేగవంతమైనదని కంపెనీ చెబుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో ఫ్రాడ్ డిటెక్షన్ ప్రొటెక్షన్ సదుపాయం ఉంది. పీవీఆర్, గూగుల్, టైమ్స్ ప్రైమ్, కల్ట్ ఫిట్‌లతో పాటు 200 కంటే ఎక్కువ బ్రాండ్ల నుంచి ప్రత్యేకమైన రివార్డులు, డిస్కౌంట్‌లు పొందొచ్చని తెలిపింది. కంపెనీ అధికారిక వెబ్‌సైట్లో ప్రీ ఆర్డర్ బుకింగ్స్ మొదలయ్యాయి. రూ.33 చెల్లించి రిజర్వ్ చేసుకోవచ్చు. మొదట బుక్ చేసుకున్న 1,500 మంది కస్టమర్లకు రూ.499కే అందించనుంది. ఆ తర్వాత కొనుగోలు చేయాలంటే రూ.999 వెచ్చించాలని పేర్కొంది.

# వివిధ రకాల మ్యూచువల్ ఫండ్ల మధ్య వ్యత్యాసం ఏంటి?




మ్యూచువల్ ఫండ్లు.. భవిష్యత్తులో మెరుగైన రాబడిని సంపాదించడానికి, డబ్బును ఆదా చేయడానికి ఉత్తమ మార్గాల్లో ఒకటి. మార్కెట్ క్యాపిటలైజేషన్ (మార్కెట్ విలువను), రిస్క్ ఆధారంగా అనేక మ్యూచువల్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయి.ప్రత్యక్షంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిలేని వారు మ్యూచువల్ ఫండ్లలో మూడు రకాల ఫండ్లలో ఏదో ఒకదానిలో ఇన్వెస్ట్ చేయొచ్చు. కంపెనీ విలువ స్టాక్ మార్కెట్ నిర్ణయిస్తుంది. మూడు రకాల మ్యూచువల్ ఫండ్లు - లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్. వీటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**లార్జ్ క్యాప్ ఫండ్లు**

కంపెనీలను వర్గీకరించడానికి సెబీ కొన్ని ప్రమాణాలను అమలు చేసింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో జాబితా చేసిన టాప్ 100 కంపెనీలను లార్జ్ క్యాప్ కంపెనీలుగా వర్గీకరించారు. లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టే మ్యూచువల్ ఫండ్లను లార్జ్ క్యాప్ ఫండ్స్ అంటారు. లార్జ్ క్యాప్ కంపెనీలు సాధారణంగా మంచి ట్రాక్ రికార్డ్స్‌ను కలిగి ఉంటాయి. ఈ కంపెనీల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. వీటిని బ్లూ-చిప్ స్టాక్స్ అని కూడా అంటారు. ఈ కంపెనీల మార్కెట్ క్యాప్ దాదాపు రూ.20,000 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటుంది. ఇవి బలమైన మార్కెట్ ఉనికిని కలిగి ఉంటాయి. ఉదాహరణకు రిలయన్స్, ఎస్‌బీఐ, ఐటీసీ, హెచ్‌యూఎల్, బ్రిటానియా మొదలైన కంపెనీలు.

**మిడ్ క్యాప్ ఫండ్లు**

మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాప్ 100 నుంచి 250 కంపెనీలను మిడ్ క్యాప్ కంపెనీలు అంటారు. ఈ కంపెనీల మార్కెట్ క్యాప్ దాదాపు రూ.5,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు ఉంటుంది. ఉదాహరణకు.. గోద్రెజ్ ఇండస్ట్రీస్, వోల్టాస్ మొదలైన కంపెనీలు. మిడ్-క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టే మ్యూచువల్ ఫండ్లను 'మిడ్-క్యాప్ ఫండ్స్' అంటారు. మిడ్-క్యాప్ కంపెనీలకు కూడా మంచి ట్రాక్ రికార్డు ఉంది. అయితే, లార్జ్ క్యాప్ ఫండ్ల కంటే మిడ్ క్యాప్ ఫండ్లలో రిస్క్ ఎక్కువ. మిడ్ క్యాప్ కంపెనీలు వాటి పరిమిత మార్కెట్ ఉనికి కారణంగా విస్తృత మార్కెట్ సూచీల్లో కాస్త తక్కువ ప్రాముఖ్యత కలిగి ఉండొచ్చు.

**స్మాల్ క్యాప్ ఫండ్లు**

మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా 251వ స్థానం నుంచి ర్యాంక్ పొందిన కంపెనీలను స్మాల్ క్యాప్ కంపెనీలు అంటారు. ఈ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.5,000 కోట్లలోపే ఉంటుంది. స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టే మ్యూచువల్ ఫండ్లను స్మాల్ క్యాప్ ఫండ్స్ అంటారు. స్మాల్ క్యాప్ కంపెనీలకు సుదీర్ఘ ట్రాక్ రికార్డ్ ఉండదు. ఉదాహరణకు స్టార్టప్ కంపెనీ లేదా అభివృద్ధిలో ఉన్న ఏదైనా కంపెనీ స్మాల్ క్యాప్ సెక్టార్ కిందకు రావచ్చు. ఈ కంపెనీలకు చాలా తక్కువ మార్కెట్ ఉనికి గల కారణంగా విస్తృత మార్కెట్ సూచీలలో ప్రాముఖ్యత ఉండదు.

లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్ల మధ్య వ్యత్యాసం..

గమనిక: మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పై పట్టికలో తెలిపిన రాబడులు భవిష్యత్‌లోనూ వస్తాయని హామీ లేదు. కాబట్టి, ఏదైనా మ్యూచువల్ ఫండ్ పథకంలో పెట్టుబడి పెట్టే ముందు సెబీ రిజిస్టర్డ్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌ను సంప్రదించడం మంచిది.

## విప్రో ఔట్.. అదానీ పోర్ట్స్ ఇన్.. సెన్సెక్స్‌లోకి అదానీ గ్రూప్ సంస్థ




**దిల్లీ:** గౌతమ్ అదానీ గ్రూప్‌నకు చెందిన కంపెనీల్లో ఒకటైన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ సెన్సెక్స్‌లోకి అడుగుపెట్టనుంది. ఐటీ సంస్థ అయిన విప్రో ఈ జాబితా నుంచి వైదొలగనుంది. జూన్ 24 నుంచి కొత్త మార్పు అమల్లోకి రానుంది. ఎస్అండ్‌పీ డౌజోనస్ సూచీ, బీఎస్‌ఈ జాయింట్ వెంచర్ అయిన ఆసియా ఇండెక్స్ ఈ మార్పును ప్రకటించింది. అలాగే సెన్సెక్స్ 50 సూచీలో టాటా గ్రూప్‌కు చెందిన ట్రెంట్ లిమిటెడ్ చోటు దక్కించుకోగా.. ఈ జాబితా నుంచి ప్రముఖ ఫార్మా కంపెనీ దివీస్ లేబొరేటరీస్ చోటు కోల్పోయింది.వాస్తవానికి అదానీ గ్రూప్ కంపెనీల్లో ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ సెన్సెక్స్ 30 సూచీలోకి వస్తుందని అంచనా వేశారు. అనూహ్యంగా అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌కు ఆ అవకాశం దక్కింది. గత ఏడాదిగా ఈ కంపెనీ షేర్లు స్థిరంగా రాణిస్తుండడమే ఇందుకు నేపథ్యం. ఏడాదిలో ఈ కంపెనీ షేర్లు 97 శాతం రిటర్నులు ఇవ్వగా.. విప్రో 16 శాతం మాత్రమే ప్రతిఫలం ఇచ్చింది. అదానీ గ్రూప్ కంపెనీల్లో సెన్సెక్స్ 30 సూచీలో చోటు దక్కించుకున్న తొలి కంపెనీ అదానీ పోర్ట్స్ కావడం గమనార్హం. నిఫ్టీ 50లో అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్ ఉన్నాయి. స్టాక్ 100లో ఆర్ఈసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, కెనరా బ్యాంక్, కమిన్స్ ఇండియా, పీఎన్‌బీ చోటు దక్కించుకోగా.. పేజ్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ కార్డ్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, జూబ్లి యెంట్ ఫుడ్‌వర్క్స్, జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటం ్ప్రైజెస్ షేర్లు ఈ లిస్ట్ నుంచి వైదొలగనున్నాయి. బీఎస్‌ఈ బ్యాంక్‌ఎక్స్‌లో యెస్ బ్యాంక్, కెనరా బ్యాంక్ చోటు దక్కించుకోగా.. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తమ స్థానాలు కోల్పోయాయి.

## ఫ్లిప్‌కార్ట్‌లో అడుగు పెట్టనున్న గూగుల్

దిల్లీ: ప్రమఖ టెక్ కంపెనీ గూగుల్ . ఈ- కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. తాజా ఫండింగ్ రౌండ్‌లో భాగంగా మైనారిటీ వాటా కొనుగోలుకు ప్రతిపాదించినట్లు వాల్‌మార్ట్ గ్రూప్ శుక్రవారం తెలిపింది. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి మైనారిటీ పెట్టుబడి దారుగా గూగుల్‌ను చేర్చుకోనున్నట్లు ఫ్లిప్‌కార్ట్ ఈరోజు వెల్లడించింది. అయితే, గూగుల్ ఎంత మొత్తంలో పెట్టుబడి పెట్టడానికి ముందు కొస్తుందనే విషయాన్ని మాత్రం ఫ్లిప్‌కార్ట్ వెల్లడించ లేదు. గూగుల్ పెట్టుబడులు, దాని క్లౌడ్ సహకారం మా వ్యాపారాన్ని విస్తరించడం, దేశవ్యాప్తంగా మరింత మంది వినియోగదారులకు సేవలు అందించడంతో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాలు ఆధునికీకరిం చడంలో సాయపడతా యని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది.




## పరువు నష్టం కేసు.. దోషిగా తేలిన మేధా పాట్కర్



దిల్లీ:
పరువునష్టం కేసులో 'నర్మదా బచావో ఆందోళన్' ఉద్యమకారిణి మేధా పాట్కర్ ను దిల్లీ కోర్టు దోషిగా తేల్చింది. 2000 నాటికి చెందిన ఈ కేసును ప్రస్తుతం దిల్లీ ఎల్‌జీగా ఉన్న వీకే సక్సేనా దాఖలు చేశారు.దీనిపై విచారణ చేపట్టిన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఈమేరకు తీర్పు వెలువరించారు. ఈ కేసులో దోషిగా తేలినవారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించ వచ్చు. మేధా పాట్కర్, వీకే సక్సేనాల మధ్య 2000 సంవత్సరం నుంచి న్యాయపోరాటం సాగుతోంది. తనతోపాటు నర్మదా బచావో ఆందోళన్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించారనే ఆరోపణలపై వీకే సక్సేనాపై ఆమె అప్పట్లో కేసు వేశారు. ఆ సమయంలో ఆయన అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న 'నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' అనే ఎన్జీవోకు చీఫ్‌గా ఉన్నారు. మరోవైపు.. ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో తనను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంతోపాటు పరువు నష్టం కలిగించేలా పత్రికా ప్రకటన జారీ చేశారని ఆరోపిస్తూ పాట్కర్‌పై ఆయన సైతం రెండు కేసులు దాఖలు చేశారు.గుజరాత్‌లో నర్మదా నదిపై 'సర్దార్ సరోవర్ డ్యామ్' నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మేధా పాట్కర్ 'నర్మదా బచావో ఆందోళన్' చేపట్టారు. ఈ డ్యామ్ కారణంగా 40 వేల కుటుంబాలు ఇళ్లను కోల్పోతాయని పేర్కొంటూ.. పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. 1961లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేసినప్పటి నుంచి వివాదాల్లో చిక్కుకున్న ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు 2017లో అందుబాటులోకి వచ్చింది.

## నటి లైలా ఖాన్ హత్య కేసు..

### సవతి తండ్రికి మరణశిక్ష



ముంబయి: ఒకప్పటి బాలీవుడ్ నటి లైలా ఖాన్ ఆమె కుటుంబం 2011లో దారుణ హత్యకు గురైంది. ఈ కేసు లో సుదీర్ఘ విచారణ అనంతరం ఆమె సవతి తండ్రిని ఇటీవల ముంబయి సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది.తాజాగా అతడికి మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులకు 13 ఏళ్ల తర్వాత శిక్ష పడటం గమనార్హం.2011 జనవరి 30న లైలా తన తల్లి షెలీనా, నలుగురు సోదరీమణులతో కలిసి నాసిక్ జిల్లాలోని ఇగత్‌పురిలో గల తమ ఫామ్‌హౌస్‌కు వెళ్లింది. ఆ తర్వాత నుంచి వీరంతా కన్పించకుండా పోయారు. దీంతో షెలీనా మొదటి భర్త, లైలా తండ్రి నదీర్ షా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. షెలీనా మూడో భర్త పర్వేజ్ తక్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో అతడి కోసం గాలింపుచర్యలు చేపట్టారు.ఆ మరుసటి ఏడాది 2012 జూన్‌లో పర్వేజ్ తక్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ కేసులో అరెస్టు చేశారు. విచారణ సమయంలో లైలా, ఆమె కుటుంబాన్ని తానే హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. వెంటనే వారు ముంబయి పోలీసులకు సమాచారమివ్వగా ఈ సామూహిక హత్యల విషయం వెలుగులోకి వచ్చింది. షెలీనా, ఆమె పిల్లల ఆస్తులపై కన్నేసిన పర్వేజ్ అవి తన పేరు మీద రాయాలంటూ ఆమెపై ఒత్తిడి పెంచాడు.ఘటన జరిగిన రోజు కూడా ఫామ్‌హౌస్‌లో ఇదే విషయమై అతడు గొడవ పడ్డాడు. అది తీవ్రమవడంతో షెలీనా తలపై బలమైన వస్తువుతో కొట్టి చంపాడు. అది చూసిన లైలా, ఆమె సోదరీమణులను సైతం అతి దారుణంగా కాల్చి చంపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఫామ్‌హౌస్ నుంచి ఆరుగురి మృతదేహాల అవశేషాలను పోలీసులు బయటకు తీశారు. అనంతరం అతడిని అరెస్టు చేశారు. నిందితుడికి లష్కరే తోయిబాతో సంబంధాలున్నట్లు దర్యాప్తులో తెలిసింది. హత్య అనంతరం నేపాల్ పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా జమ్మూకశ్మీర్ పోలీసులకు చిక్కాడు.లైలాఖాన్ 2002లో కన్నడ చిత్రం మేకప్‌తో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత కొన్ని చిన్నచిన్న చిత్రాల్లో కన్పించింది. 2008లో రాజేశ్ ఖన్నా సరసన ఆమె చేసిన 'వాఫా: ఎ డెడ్లీ లవ్ స్టోరీ' సినిమా ఆమెకు గుర్తింపుతెచ్చింది.

## రేవ్ పార్టీపై రగడ.. 'ఉడ్తా బెంగళూరు'పై కన్నడనాట మాటల యుద్ధం



బెంగళూరులో ఇటీవల వెలుగుచూసిన రేవ్ పార్టీ ఉదంతం ఆ రాష్ట్రంలో రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని సిద్ధరామయ్య ప్రభుత్వంపై భాజపా విమర్శలు చేసింది.సిలికాన్ సిటీ ని ఉడ్తా బెంగళూరుగా మార్చారని ఆరోపించిన కాషాయ నేతలు.. రేవ్ పార్టీలు, మాదక ద్రవ్యాలకు నగరాన్ని అడ్డాగా మార్చాయని మండిపడింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం.. నగర ప్రతిష్ఠను దిగజార్చే విధంగా మాట్లాడటం సరికాదని హితవు పలికింది.''కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బెంగళూరులో ఎక్కడ చూసినా అసాంఘిక కార్యకలాపాలు వెలుగు చూస్తున్నాయి. శాంతి భద్రతలు క్షీణించాయి. సిలికాన్ నగరం.. రేవ్ పార్టీలు, డ్రగ్స్‌తో నిండిపోయింది" అని కర్ణాటక భాజపా తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎంలతో కూడిన ఓ పోస్టర్‌ను షేర్ చేసింది. రాజధానిని 'ఉడ్తా బెంగళూరు'గా పేర్కొన్న భాజపా.. సిలికాన్ సిటీ మాదకద్రవ్యాలకు అడ్డాగా మారిందని మండిపడింది. పంజాబ్‌లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని ఎత్తిచూపుతూ కొన్నేళ్ల క్రితం 'ఉడ్తా పంజాబ్' పేరుతో బాలీవుడ్‌లో సినిమా వచ్చింది.బెంగళూరుపై భాజపా చేసిన ఆరోపణలను రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర తప్పుపట్టారు. మాదకద్రవ్యాల వాడకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఇప్పటికే రూ.కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేసి ధ్వంసం చేశామని చెప్పారు. అనేకమంది విదేశీయులను వెనక్కి పంపించివేశామన్నారు. ఉడ్తా బెంగళూరు అనే పదాన్ని ప్రతిపక్ష భాజపా ఉపయోగించడం సరికాదన్నారు. బెంగళూరులో ఓ ఫామ్ హౌస్‌లో ఇటీవల నిర్వహించిన రేవ్ పార్టీపై దాడి చేసిన పోలీసులు.. 103 మందిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 86 మంది మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు తేలింది. దీనిలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు ఉన్న విషయం తెలిసిందే.

## సాంకేతికలోపంతో చక్కర్లు కొట్టిన హెలీకాప్టర్..

కేదార్‌నాథ్: పవిత్ర చార్‌ధామ్ యాత్ర లో ఒకటైన కేదార్‌నాథ్ కు బయల్దేరిన యాత్రికులకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది.వారు ప్రయాణిస్తున్న హెలీకాప్టర్ లో సాంకేతిక లోపం తలెత్తి గాల్లో చక్కర్లు కొట్టింది. అయితే, పైలట్ అప్రమత్తత వల్ల వారంతా సురక్షితంగా బయటపడ్డారు. కేస్ట్రల్ ఏవియేషన్‌కు చెందిన హెలీకాప్టర్ సిర్సీ నుంచి కేదార్‌నాథ్‌కు బయల్దేరింది. అందులో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తుండగా గాల్లో చక్కర్లు కొడుతూ హెలిప్యాడ్‌కు సుమారు 100 మీటర్ల దూరంలో గడ్డి నేలపై ల్యాండ్ అయ్యింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో అక్కడ ఉన్న పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. గట్టిగా కేకలు వేస్తూ అక్కడినుంచి పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు. హెలీకాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు, పైలట్ సురక్షితంగా ఉన్నారు. సిర్సీ నుంచి కేదార్‌నాథ్ ధామ్‌కు ఆరుగురు ప్రయాణికులతో వస్తున్న హెలికాప్టర్‌ను కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా అత్యవసర ల్యాండింగ్ చేయాల్సివచ్చింది. సాంకేతిక సమస్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది" అని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి తెలిపారు.గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లతో కూడిన చార్ ధామ్ యాత్ర మే 10న ప్రారంభమైంది. హిందువులకు ఈ యాత్ర ఎంతో పవిత్రమైనది. సాధారణంగా చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్-మే నుంచి అక్టోబర్-నవంబర్ వరకు జరుగుతుంది. ఇది యమునోత్రి నుంచి మొదలై, గంగోత్రి, కేదార్‌నాథ్ మీదుగా సాగి, చివరకు బద్రీనాథ్‌లో ముగుస్తుంది. ఈ యేడాది యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం యాత్రికులందరికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది.

## కరీంనగర్ మార్కెట్



కరీంనగర్ అనే ఓ పెద్ద నగరానికి దగ్గరలో తోటపల్లి అనే ఒక చిన్న పల్లెటూరు ఉంది. ఆ పల్లె రైతులు అడవిలోని పండ్లతో పాటు తాము పండించిన కూరగాయలను కరీంనగర్ మార్కెట్ కు తీసుకొని వచ్చి అమ్ముతూ వెళ్లేవారు. అలా వచ్చిన డబ్బుతో వారు జీవనం కొనసాగించేవారు. తోటపల్లి ప్రజలు కూరగాయలను ఎలాంటి ఎరువులు వాడకుండా సేంద్రీయ పద్దతిలో పండించేవారు. అవి చాలా తాజాగా ఉండేవి. నగర ప్రజలు వాటిని ఏ రోజుకారోజు కొనుక్కొని తినడం వలన వారంతా ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేవారు.

తోటపల్లి రైతుల వ్యాపారం బాగా నడవడంతో అది చూసిన ఒక పెద్ద వ్యాపారి ఇతర ప్రాంతాల నుండి రసాయన ఎరువులతో పండించిన కూరగాయలను చాలా తక్కువ ధరకు తీసుకువచ్చి అమ్మడం ప్రారంభించారు. అవి రసాయనిక ఎరువులతో పండినవి కావడం వలన చూడడానికి ఆకర్షణగా ఉండేవి. పైగా ఆ వ్యాపారి తోటపల్లి రైతుల కంటె తక్కువ ధరలకే ఆ పండ్లను, కూరగాయలను అమ్మేవాడు. దాంతో నగర ప్రజలు ఆ వ్యాపారి దగ్గరే ఎక్కువ కొనేవారు. పల్లె ప్రజలు ఎక్కువ ధరకు సరుకులు అమ్మారని ఇన్ని రోజులు తాము మోసపోయామని ఆ నగర ప్రజలు అనుకుంటారు. వారితో గొడవ పడతారు. ఇక నుండి మీ వద్ద సరుకులు కొనము అని అంటారు. దానితో తోటపల్లి ప్రజల బ్రతుకు భారమవుతుంది. వారు నగర మార్కెట్ కు రావడం మనేస్తారు.

అలా కొద్దీ రోజులు గడిచాక నగర ప్రజలు తరచుగా అనారోగ్యం పాలవుతారు. వారికి జలుబు, దగ్గు, వాంతులు, విరోచనాలతో పాటు అనేక రకాల పెద్ద రోగాలు కూడా వస్తాయి. దీంతో ప్రభుత్వం వారు డాక్టర్లచే నగర ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేపిస్తుంది. వారంతా తరచుగా అనారోగ్యంపాలు కావడానికి కారణం వారు పురుగుల మందు అవశేషాలు ఉన్న కూరగాయలు తినడమే అని చెపుతారు. అప్పుడు నగర ప్రజలకు అసలు విషయం అర్థమవుతుంది. తాము ఇన్ని రోజులు తోటపల్లి రైతులను అనవసరంగా అవమానించి, అనుమానించామని బాధపడుతారు. నగరంలోని కొందరు ముఖ్యమైన వ్యక్తులు తోటపల్లికి వెళ్లి, వారిని క్షమించమని అడుగుతారు. ఇక నుండి సహజ పద్దతిలో పండించే మీ కూరగాయలను మాత్రమే మేము కొనుగోలు చేస్తామని చెపుతారు.

తోటపల్లి ప్రజలు సంతోషంతో మళ్లీ కరీంనగర్ మార్కెట్ కు వస్తారు. నగర ప్రజల ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. అందరూ ఎప్పటిలాగే కలిసి మెలిసి ఉంటారు.

ఎం.డి. అస్మిన్, ఇంటర్ సెకండ్ ఇయర్,
గ్రా. జగదేవ్ పేట, జగిత్యాల జిల్లా.




### కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ ప్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# బిఆర్ఎస్ నేతల పెడబొబ్బలు !

దొంగే దొంగాదొంగా అని అరవాలి. ..అల్లరి చేయాలి. గాయ్ చేయాలి. గత్తర లేపాలి. ఇప్పుడు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ అదే చేస్తోంది. అప్పులు చేశారంటే సమాధానం లేదు. కాళేశ్వరం కుప్ప చేశారంటే మాటల్లేవు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటే ..అది పోలీసులు చేసే పనులంటూ..దాటవేత... ఒక్కటేంటి.. పదేళ్లలో తెలంగాణను చిక్కుముడులు వేసి కోలుకోకుండా దెబ్బవేసిన ఘనత కల్వకుంట వారిది. అయినా ఇంకా పెడబోబ్బలు పెడుతున్నారు. తెలంగాణకు అన్యాయం జరిగిందని అంటున్నారు. ఆరు నెలల్లోనే అస్తవ్యస్తం అయ్యిందని గావు కేకలు పెడుతున్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు ఎక్కడికి వెళ్లినా అంగట్లో పెద్దమ్మలోళ్లు అరిచినట్లుగా చేస్తున్నారు. పాలేందో నీళ్లేందో తేలిపోయిందట... వద్దురా ఈ కాంగ్రెస్ పాలన అని ప్రజలు మొత్తుకుంటున్నారట..కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందట.. వడ్లకు బోనస్ కాదు కదా అసలు వడ్లే కొనడం లేదట.. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారట.. రేవంత్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో వెళ్తోందట...మంచి నీళ్లు రావడం లేదు.. కరెంటు లేదు.. పథకాలు బంద్ అయ్యాయట.. కేసీఆర్ హయాంలో రైతులకు కరెంటుకు ఇబ్బంది లేనేలేదట. కాంగ్రెస్ వచ్చాక మోటర్లు కాలిపోతున్నాయట. వడ్లకు బోనస్ బోగస్.. రైతుభరోసా రాలేదు. మహిళలకు 2500 రాలేదు.. అవ్వాతాతల కు 4 వేల పింఛన్ రాలేదు. రైతులకు 2 లక్షల రుణమాఫీ కాలేదు.. ఒక్క ఉచిత బస్సు తప్ప అన్నీ తుస్ అని అట. నిరుద్యోగులకు 4 వేల భృతి ఇస్తామని ఇవ్వడం లేదట.. ఇలా ఎందుకు జరిగిందన్న ఇంగితం లేకుండా మాట్లాతున్నారు. అడిగేవారు లేరనుకుంటున్నారు. తెలంగాణను అధోగతి పాలు చేసిన బిఆర్ఎస్ ఇప్పుడు ఎదురుదాడి చేయడం దుర్మార్గం తప్ప మరోటి కాదు. నిజంగా ఇవన్నీ ఇవ్వాలంటే రాష్ట్రం గాడిలో ఉందా లేదా చెక్ చేయాలి. కానీ కారులో వచ్చిన కల్వకుంట్ల వారు బంగారు తెలంగాణ... ధనిక తెలంగాణ అంటూ ఊదరగొట్టి కరిమింగిన వెలగపండును చేసి వెళ్లారు. వారి నిర్వాకంపై ప్రపంచ మంతా కోడై కూస్తుంటే ప్రజలకు తెలియకుండా..వారి మదిలో చేరుకుండా గత్తర లేపుతున్నారు. నిజానికి గత ప్రభుత్వాలు చేసిన పాపాలపై ఆనాటి పాలకులను నిలదీసి కక్కించేలా చట్టాలు రావాలి. ఉత్త పుణ్యానికి తెలంగాణను పూర్తిగా డొల్లగా మార్చారు. చెప్పుకుంటూ పోతే అనేక విషయాలు చర్చించవచ్చు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు అందడంలేదంటే కారణం..గత ప్రభుత్వం. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు క్లియర్ కావడం లేదంటే గత పాలకులే కారణం. ఇలా చెప్పుఉంటూ పోతే అనేక విధాలుగా అప్పులకుప్ప చేసి అందమైన బొమ్మను చూపారు. ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే కంపెనీలకు బిల్లుల చెల్లింపు జరగలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకూ చెల్లింపుల్లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకు పోయిన బిల్లులు ఇప్పటికీ క్లియర్ కావడం లేదు. ఖజానాలో సొమ్ములేక ప్రభుత్వం వీటిని పెండింగ్‌లో పెడుతోంది. దీంతో ఆయా వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. కాలేజీ యాజమాన్యాల నుంచి విద్యార్థులకు సమస్యలు ఎదురవుతుండగా, ఆస్పత్రుల్లో మందులు లభించక, ఆరోగ్యశ్రీ సేవలు సవ్యంగా అందక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారిందని యాజమాన్యాలు వాపోతున్నాయి. కాలేజీలను మూసేసుకునే పరిస్థితి దాపురిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఔషధ కంపెనీలు తమకు బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేయలేమంటూ చేతులెత్తేస్తున్నాయి. ఇక ఆరోగ్యశ్రీ బిల్లులు పది నెలలుగా క్లియర్ కావడం లేదని నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం అంటోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడానికి గతంలో కెసిఆర్ ప్రభుత్వ నిర్వాకం తప్ప మరోటి కాదు. వారు చేసిన అప్పులకు వడ్డీలు తడిసి మోపెడు అయ్యాయి. నెలవారీగా సమకూరుతున్న రాబడులు.. నెలవారీ వ్యయాలకే సరిపోతుండడంతో ప్రభుత్వ ఖజానాలో సొమ్ము మిగలడం లేదు. జీతాలు చెల్లించడం గగనంగా మార్చారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల బకాయిలు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయంటే ఎంత దారుణంగా గత ప్రభుత్వం వ్యవహరించిం దో చర్చించాలి. 2019-20 సంవత్సరం నుంచి ఫీజులను ప్రభుత్వం కాలేజీ యాజమాన్యాలకు చెల్లించక పోవడంతో అవి భారీగా పేరుకుపోయాయి. వీటికి ప్రతి ఏటా కొంత కలుస్తూ ప్రస్తుతం ఈ రెండు పద్దుల కింద రూ.6 వేల కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రీయింబర్స్‌మెంట్ బకాయిలే రూ.4 వేల కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. ఫలితంగా ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని బయటికెళ్లబోయే విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మరోవైపు ఇంటర్, డిగ్రీ పూర్తియిన విద్యార్థులు రెండు మూడేళ్ల క్రితమే కోర్సును పూర్తి చేసినా.. ఫీజు రీయింబర్స్ కాలేదు. ప్రధానంగా అప్పుల అసలు, వడ్డీలు చెల్లించాలంటేనే ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. నెలవారీగా సమకూరుతున్న రాబడులు... నెలవారీ వ్యయాలకే సరిపోతున్నాయి. ఇందులో ప్రతి నెలా అన్ని రకాల రాబడుల ద్వారా రూ.12-14 వేల కోట్ల వరకు నిధులు సమకూరుతున్నాయి. నెలకు మరో రూ.4-5 వేల కోట్ల వరకు రుణాలు తీసుకుంటోంది. ఇలా వచ్చే రూ.18-19 వేల కోట్లను ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, అప్పుల కిస్తులు, వడ్డీ చెల్లింపులకు సర్దుతోంది. పర్యవసానంగా సప్లిమెంటరీ బిల్లుల క్లియరెన్స్‌కు ఖజానాలో సొమ్ము మిగలడం లేదు. అప్పుల అసలు, వడ్డీల కింద 2023-24లో ప్రభుత్వం రూ.53,978 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. అంటే... నెలకు సగటున రూ.5 వేల కోట్లు అసలు, వడ్డీలకే సరిపోయాయి.ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల కింద రూ.4,500 కోట్లకు పైగా చెల్లించాలి. ఈ వడ్డీలు, వేతనాలే సింహభాగం నిధులను హరిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని శాఖలను ఊడ్చేశారు. అందినకాడికి కల్వకుంట్ల వారు అప్పులు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ మీద పడి కుటుంబమంతా ఏడ్చేస్తోంది. వీరికి తోడు బిజెపి వారు కూడా శాపనార్థాలు లంఖించుకున్నారు. ప్రభుత్వం రాగానే సర్దుకునే లోపే చేస్తున్న విమర్శలు..కేవలం చేసిన తప్పులను,అప్పులను కప్పి పుచ్చుకునేందుకే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు.

### నిశ్శబ్దంగా మండటం నేర్చుకోలి..!

కొన్ని కోట్ల గొంతుకలను ఏకం చేసే
నీ ఆశయాల ఆయువు,
ఆగని నీ అపజయాల కడలిలో..
అర్థాంతరంగా మునిగిపోతుందని
ఆందోళన పడుతున్నావా?

కొన్ని తరాల తత్వాల
సారాంశపు పాఠ్యాంశమైన
నీ సంకల్పపు సాహిత్యపు ప్రకాశం,
సమాజపు అజ్ఞానపు
అమాయకత్వంలో
మాయమవుతుందని
నిశీథి నీడలో నిద్రపోతున్నావా?

నీ ఆలోచనల యజ్ఞం
ఓ అరుణోదయమై..
అనునిత్యం ఈ జగతిపై
ఓ జ్ఞానయుద్ధం చేస్తుంటే
అలలలా ఎగిసిపడే
నీ జీవితపు అడుగులు
చరిత్రగతిని మార్చే
పోరాటపు అక్షరాలై
అక్షరాస్యతను పరిగెత్తిస్తుంటే...
నీలో నువ్వు నిశ్శబ్దంగా
మండటం నేర్చుకో కొంతకాలం..!

నిర్దిష్ట సమయం తర్వాతే
రాకెట్ లా పెద్ద శబ్దమై
అనంత విశ్వంలోకి విక్రమ్
ల్యాండర్ లా దూసుకెళ్తావు..!!
అందనంత ఎత్తులో ఎదిగి
భవిష్యత్ యువతకు నువ్వే
ఓ ఉన్నత వ్యక్తిత్వపు
స్ఫూర్తి శిఖరమవుతావు..!!
విశ్వ గమనాన్ని మార్చే ఫిజిక్స్
సూత్రమై మిగిలిపోతావు..!!

ఫిజిక్స్ అరుణ్ కుమార్
మోటివేషనల్ స్పీకర్, కవి
నాగర్ కర్నూల్
9394749536

# పర్యావరణానికి సవాల్‌గా వ్యర్థాలు

## మంచుకొండల్లో గుట్టల్లా పేరుకుంటున్న చెత్త

## పర్వతారోహకులు, పర్యాటకుల తాకిడితో

## పెరుగుతన్న కాలుష్యం

న్యూఢిల్లీ,మే24 (ప్రజామంటలు): ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం ఎవరెస్ట్ చెత్తకుప్పగా మారుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పర్యాటకులకు తోడు, పర్వతారోహకులు వదిలేస్తున్న చెత్త కారణంగా పర్వత శ్రేణులు కాలుష్యం బారిన పడుతున్నాయి. ఇది మనకు తీరని నష్టం చేస్తుందని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దీనినుంచి గుణపాటం నేర్చుకోవాల న్నారు. ప్లాస్టిక్ సహా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. మరో ముఖ్యంగా 8,848 మీటర్ల ఎత్తు ఉండే ఎవరెస్ట్ శిఖరంపై టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతున్నది. ఎవరెస్ట్ అధిరోహణకు ఏటా వేలా మంది పర్వతారోహకులు వెళ్తుంటారు. వీరంతా వాడి పడేసే వస్తువులు, ఇతరత్రా వాటి వల్ల ఎవరెస్టు పర్వతం ప్రపంచంలోనే ఎత్తయిన వ్యర్థ పదార్థాల డంపింగ్‌గా మారుతున్నది. గత కొన్నేండ్ల కార్యకలాపాల వల్ల పర్వతంపై 50 టన్నుల మేర చెత్త మిగిలి ఉండే అవకాశం ఉన్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎవరెస్టు బేస్ క్యాంపు వద్ద ప్రతి సీజన్‌లో 75 టన్నుల వ్యర్థాలను తొలగిస్తుంటారు. ఇంకా పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, దాన్ని తొలగించడం ప్రతి ఏడాది ఒక నిరంతర ప్రక్రియగా మారింది. ఇది అత్యంత దారుణమైన నిజమని పురుషోత్తం రెడ్డి అన్నారు. ఇలాంటి వాటిని ఎలా నిర్మూలించుకోగలమో ఆలోచన చేయాలన్నారు. ఎవరెస్టు పర్వతం, దాని సమీపంలోని సాగరమాత నేషనల్ పార్క్‌కు ఏటా వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. 2014, 2017 మధ్య ఈ సంఖ్య రెట్టింపు అయింది. ప్రస్తుతం ప్రతి ఏడాది 60 వేల మంది వరకు విదేశీ పర్యాటకులు పార్కుకు వస్తున్నారు. వీరికి అదనంగా వేలాది నేపాలీ గైడ్స్ ఉంటుంటారు. వీరు ప్రతి ఏడాది 1,000 టన్నుల వ్యర్థాలను వదిలి వెళ్తారని ఒక అంచనా. అయితే ఇందులో చాలా వరకు పార్కులోనే ఉండిపోతున్నది. ప్రధానంగా పర్వతారోహణను ప్రారంభించే ఎవరెస్టు బేస్ క్యాంపు వద్ద అధికంగా వ్యర్థాలు పడి ఉంటున్నాయి. క్యాంపుల వద్ద ఉండే చెత్తను చాలా వరకు శుభ్రం చేస్తున్నప్పటికీ, పర్వతంపై ఉండే వ్యర్థాల మొత్తాన్ని క్లీన్ చేయడం సాధ్యపడటం లేదు. ఎందుకంటే అంత ఎత్తుకు వెళ్లి వాటిని సేకరించి మళ్లీ కిందకు తీసుకుని రావడం సాధ్యమయ్యే పనిగా లేదు. ఎవరెస్టుపై అత్యంత కాలుష్య ప్రాంతంగా నాల్గవ క్యాంపు ఉన్నది. ఇది పర్వతారోహకులు చివరగా ఆగే స్థలం. సముద్ర మట్టానికి 7,900 మీటర్ల ఎత్తులో ఉండే, డెత్ జోన్‌గా పిలిచే ఈ ప్రాంతం నుంచి వ్యర్థాలను తీసుకురావడం అంత సులభం కాదని ది ఎవరెస్టు ప్రాజెక్టు సీఈవో కాఫ్‌మాన్ పేర్కొన్నారు.



ఈ సైట్ వద్ద పర్వతారోహకులు కొంత సేపు మాత్రమే ఆగుతారు. తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉండే నేపథ్యంలో కిందకు దిగి వచ్చే సమయంలో చాలా త్వరగా వచ్చేస్తారు. ఈ క్రమంలో తమకు సంబంధించిన టెంట్లు, ఆక్సిజన బాటిళ్లు, స్టీల్ గిన్నెలు, స్టూన్లు వంటివి అక్కడే వదిలేస్తారు.వ్యర్థాల నిర్వహణను సాగరమాత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(ఎస్‌పీసీసీ) చేపడుతున్నది. 2014 నుంచి ఎవరెస్టు బేస్ క్యాంపును దాటి వెళ్లిన వారు తిరిగి 8 కేజీల వ్యర్థాలను తమ వెంట కిందకు తీసుకురావాలనే నిబంధన పెట్టారు. లేకుంటే 4 వేల డాలర్లు(రూ.3.3 లక్షలు) డిపాజిట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. వ్యర్థాల నిర్వహణకు ఎస్‌పీసీసీ ఎంత ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, సమస్య పూర్తిగా పరిష్కారం అవుతున్నట్టు కనిపించడం లేదు. మరోవైపు ఎవరెస్టుపై చెత్తను తొలగించడంలో నేపాల్ సైన్యం కూడా సహకారం అందిస్తున్నది. 2022లో ఎవరెస్టు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 34 టన్నుల వ్యర్థాలను తొలగించామని ఆర్మీ పేర్కొన్నది. ఈ క్రమంలో నిబంధనలు కఠినతరం చేయాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అన్నారు.

## ఆన్‌లైన్‌లో యాదాద్రి సేవలు

### తిరుమల తరహాలో అందుబాటులోకి

యాదాద్రి,మే24(ప్రజామంటలు): తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లు తున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం తర్వాత ఇలా వైకుంఠంగా పేరుందిన తిరుమల తరహాలో యాదాద్రిలో ఆలయనిర్మాణం, మాఢవీధులు, స్వామివారి పూజ కైంకర్యాలు, ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాలు, ప్రసాదాలతో తెలంగాణ తిరుమలగా రూపుదిద్దుకుంది.తిరుమల తరహాలో యాదాద్రి సేవలను, దర్శనాలను ఆన్‌లైన్ చేయాలని యోచిస్తున్నారు. ఇది యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించే భక్తులకు శుభవార్తగా చెప్పుకోవాలి రోజు రోజుకు లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయ పునర్నిర్మాణం తరవాత గణనీయంగా యాత్రికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పెద్ద సంఖ్యలో ఆలయానికి భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రీశుడి దర్శనం కోరి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి తిరుమల దేవస్థానం తరహాలోనే యాదాద్రి ఆలయంలో కూడా టికెట్లును ఆన్‌లైన్‌లో పొందే విధంగా ఏర్పాటు చేసింది ఈ పుణ్యక్షేత్రానికి భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరోవైపు వీఐపీ, వీవీఐపీ,



రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల సిఫార్సులపై వచ్చే భక్తులకు 300 రూపాయల టికెట్‌తో బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. రూ.150 చెల్లించి శీఘ్రదర్శనం ఆన్ లైన్ లో నమోదుకు అవకాశం ఉండగా, ప్రస్తుతం అన్ని సేవలను ఆన్ లైన్ అందుబాటులోకి దేవస్థానం తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ను సందర్శించి టికెట్స్ బుక్ చేసుకోవచ్చు. ఇక ఇదే వెబ్ సైట్ నుంచి ఈ హుండీ ద్వారా డొనేషన్స్ కూడా ఇవ్వవచ్చు. ఆన్ లైన్ బుకింగ్ ద్వారా గంట ముందు దర్శన, పూజ కైంకర్యాలకు బుకింగ్ చేసుకునే అవకాశం యాదగిరిగుట్ట దేవస్థానం కల్పించింది. ఆన్ లైన్ బుకింగ్ లో పేరు, గోత్రం, పూజ వివరాలు, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, తేదీ, ఎన్ని టికెట్లు, అడ్రస్, ఆధార్ నెంబర్, ఆలయ సందర్శన వేళ వంటి వివరాలు నింపాలి. ఆన్ లైన్ బుకింగ్, కౌంటర్ లో కంప్యూటరైజ్డ్ టికెట్లు పొందిన భక్తులకు తూర్పు రాజగోపురం వద్ద టికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆలయంలో లోనికి అనుమతిస్తారన్నారని ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు. ఇది మంచి ఆలోచన అని భక్తులు కూడా ఆహ్వానిస్తున్నారు.

# మామిడి మార్కెట్ సందర్శించిన జిల్లా సిపిఐ కార్యదర్శి




**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** భారత కమ్యూనిస్టు పార్టీ జగిత్యాల జిల్లా సమితి కార్యదర్శి వెన్నె సురేష్ మరియు కార్యకర్తలు కలిసి మామిడి వ్యవసాయ మార్కెట్లో సందర్శించి అక్కడ ఉన్న రైతుల మరియు కూలీల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారి దృష్టికి వచ్చిన విషయాలను మీడియా వారితో పంచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వెన్న సురేష్ మాట్లాడుతూ ముఖ్యంగా బంగినపల్లి తన్నుకు 35 వేల రూపాయలు కమిషన్ ఏజెంట్లు రైతులకు ఇస్తుంటే మార్కెట్ కమిటీ కార్యదర్శి మాత్రము పత్రికలు ఇచ్చిన సమాచారం ప్రకారం సరాసరి 45 వేల రూపాయలని చెప్పడం అన్యాయమైన విషయమని సరే ఒకసారి అంటే అత్యల్పం 35 వేల రూపాయలు తన్నుకు అత్యధికం 55 వేల రూపాయలు 55 వేల రూపాయలకు తన్నుకు ఏ రైతు దగ్గర కొనుగోలు చేశారో చూపగలుగుతారా కార్యదర్శి గారు అని అడిగారు. ప్రజలను రైతులు నమ్మించే ప్రయత్నం చేసి ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం అని నమ్మించే ప్రయత్నం జరుగుతుందని అనుమానం కలుగుతుందని మా కలుగుతున్న అనుమానాన్ని దూరం చేసే ప్రయత్నం మీరే చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో పది రూపాయలు ఎక్కడికి వెళు_న్నాయో కార్యదర్శి చెప్పాలని రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్న స్థానికంగా కాంగ్రెస్ నాయకులు టీ జీవన్ రెడ్డి మార్కెట్ సందర్శించి రైతులకు జరుగుతున్న అన్యాయం పట్ల ఎటువంటి చర్య తీసుకోపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కమిషన్ ఏజెంట్లు రైతుల వద్ద నుండి ప్రతి తన్నుకు ధరలో రైతుల నుండి 4% కమిషన్ తీసుకోవాలి. దానికి విరుద్ధంగా 10% తీసుకోవడం జరుగుతుందని నాలుగు శాతం తీసుకుంటున్నట్టు రసీదు ఇస్తూ డబ్బులు ఇచ్చి సందర్భంలో మరో తెల్ల కాగిరంలో 10 శాతం కమిషన్ తీసుకొని రైతులకు ఇస్తున్నారని వివిధ పత్రికల్లో తరచుగా ఇవే అంశంపై వార్తలు వస్తున్న స్థానిక లీడర్లు అధికార పార్టీలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షంలో ఉన్న టీఆర్ఎస్ నాయకులు అలాగే బిజెపి నాయకులు ఎవరు కూడా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని ఆ 6% కమిషన్ లో అధికార ప్రతిపక్ష ప్రధాన పార్టీలకు వాటా ఉందా అని అనుమానం కలుగుతుందని ఈ సందర్భంగా వెన్న సురేష్ అనుమానం వ్యక్తం చేశారు. హమాలీలకు టన్నుకు 261 రూపాయలు ఇవ్వవలసి ఉండగా ఇష్టారీతిగా 150,200ఇవ్వడం జరుగుతుంది ఇది అన్యాయం కాదా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన హమాలీలు హమాలీలు కాదా ప్రజలను ఓటర్లుగా చూడడం మానేసి ప్రధాన పార్టీలు వాళ్ళని మనుషులుగా చూసే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంత జరుగుతున్న ప్రధాన పార్టీలు పట్టించుకోవడం లేదంటే ఖచ్చితంగా ఈ దోపిడీలో వారికి వాటా ఉందని రైతుల అనుకోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు అలాగే మామిడి తోటల్లో పనిచేయించుకోవడానికి వలస కూలీలను తీసుకెళ్తున్న వ్యక్తులు వారికి సరియైన వేతనాలు ఇవ్వకుండానే మహిళలకు ఓ వేతనం పురుషులకు మరో వేతనం ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారని ఇట్టి విషయని కార్మిక శాఖ దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకులు వెన్న మహేష్, ఏఐటీయూసీ నాయకులు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సోదరులారా! నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త....!

### హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జీ. విజ్ఞప్తి




**జమ్మికుంట మే 24 (ప్రజామంటలు):** హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జీ. తెలియచేయునది ఏమనగా రైతులందరూ కూడా వర్షాకాలంలో పంటలు వేసుకోవడానికి అందరూ దుక్కి దున్ని విత్తనాల కొరకు ఎదురుచూస్తూ ఉంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉండటం వల్ల రైతు సోదరులందరూ కూడా మోసపోకుండా మంచి విత్తనాలను కొనుగోలు చేసి మంచి పంటను మీరు పొందాలని హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీస్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్లో మంచి విత్తనాలతో పాటు నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉన్నందున రైతులు మోసపోకుండా నాణ్యమైన పత్తి విత్తనాలను వరి విత్తనాలను ఎంచుకొని మీ పంట పొలాల్లో నాటుకోవాలని హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసులు రైతుల సంక్షేమం కొరకు పలు సూచనలు తెలియజేయడం జరుగుతుంది. మీరు మార్కెట్లో విత్తనాలను ఖరీదు చేసేటప్పుడు కచ్చితంగా బిల్లు తీసుకోవాలని ఎక్కడైనా తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి నకిలీ విత్తనాలను తీసుకుంటే ఆ తర్వాత భారీగా నష్టపోతారని అలాంటి నష్టం మీకు వాటిల్లకుండా ఉండాలంటే నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని తీసుకోవాలని తెలుపుతున్నాం. ఎవరైనా ఎక్కడైనా నకిలీ విత్తనాలు మీకు ఇవ్వాలని చూసిన మీ దృష్టికి వచ్చిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో కానీ సంబంధిత పోలీసు అధికారులకు కానీ లేదా వ్యవసాయ అధికారులకు కానీ సమాచారం అందించాలని కోరుతున్నాం. మీ కోసం మేము తయారు చేసిన ఈ క్రింది సూచనలు పాటించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి మంచి రాబడులను పొందాలని కోరుకుంటున్నాము.

## గాంధీ ఆవరణలో గుర్తు తెలియని డెడ్ బాడీ



**సికింద్రాబాద్ మే 24 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రి ఆవరణలో మరో గుర్తు తెలియని డెడ్ బాడీ వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్.ఐ. జ్ఞానేశ్వర్ కథనం ప్రకారం...గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డు సమీపంలో ఓ గుర్తు తెలియని డెడ్ బాడీ (45) ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే డెడ్ బాడీ దగ్గర ఎలాంటి వివరాలు లభించకపోవడంతో పోలీసులు బాడీని మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఆసుపత్రి పరిసరాల ప్రాంతంలో బిక్షాటన చేసుకునే యాచకుడి డెడ్ బాడీగా పోలీసులు భావిస్తున్నారు. ఫొటోలోని చనిపోయిన వ్యక్తికి సంబందించిన వివరాలు తెలిసినవారు చిలకలగూడ పీఎస్ లో తెలపాలని ఎస్.ఐ. కోరారు.

# నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా

**- రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం**

**- దొంగతనాల నివారణకు నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి. - జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్**



**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** నేర విచారణ మరింత సమర్ధవంతంగా చేయడంతో పాటు చాలా రోజుల నుండి పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాటిని సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా పని చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ సూచించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.... ఇప్పటివరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. గుర్తుతెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేయగానే వెంటనే ఫోటోలు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని సూచించారు దీని ద్వారా ఎక్కడైనా మిస్సింగ్ పర్సన్ ఉంటే రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి మిస్సింగ్ కేసులను ఛేదించవచ్చని సూచించారు. దోపిడీ, దొంగతనాలు ఇతర రకాల నేరాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి అని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర నియంత్రణ చర్యలలో కీలక పాత్ర పోషించే సి సి కెమెరాల ఏర్పాటు లో ప్రజలకు సీసీ కెమెరాల ఉపయోగలపై అవగాహన కలిగిస్తూ ప్రజలను, వ్యాపారులను బాగస్వామ్యులను చేయాలని, జిల్లాలో ఎక్కడెక్కడ %ఎ%% కెమెరాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని కెమెరాలు పని చేయు స్థితిలో ఉన్నాయి. ఇంకా ఎన్ని ప్రదేశాల్లో అవసరం ఉన్నాయో పూర్తి వివరాలు సేకరించాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాల పై నిఘా ఉంచాలని వారి పై కేస్ లు నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో గంజాయి,మత్తు పదార్థాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ యంత్రంగం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని మండలాల్లో, గ్రామాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించాలని అన్నారు. వివిధ జిల్లాల నుండి జిల్లాకు వచ్చే గంజాయి మూలలను,కీలక వ్యక్తులను గుర్తించి వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు..లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం:** జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయాలకు పాల్పడే విక్రయదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేస్తాము అని తెలిపారు. మరియు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలని సూచించారు. మార్కెట్లో బిటి3 పత్తి విత్తనాలకు ఎలాంటి పర్మిషన్ లేదు అనుమతి లేని విత్తన విక్రయాల దారులవద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. మరియు విత్తనా డీలర్లుల వద్ద నే విత్తనాలు కొనుగోలు చేయలని, తప్పనిసరిగా బిల్ అడిగి తీసుకోవాలని తెలిపారు, మరియు గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు అమ్మే వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. ఎవరైనా గ్రామాల్లో కి వచ్చి విత్తనాలు అమ్ముచుంటే ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేదని వాటిని కొనవద్దని సూచించారు. గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయవద్దని వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు/వ్యవసాయ అధికారుల కు తెలపాలని లేదా డయల్ 100 కాల్ చేసి తెలిపినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినారు. ఈ యొక్క నకిలీ విత్తనాల నివారణ కోసం స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ యొక్క టీం జిల్లాలో వ్యవసాయ అధికారులను సహాయంతో అన్ని ఎరువుల దుకాణంలో తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రవీంద్ర కుమార్, రఘు చందర్, ఉమామహేశ్వర రావు, రంగారెడ్డి, వ్యవసాయ అధికారులు, డిసిఆర్ బి, సిసిఎస్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్ ఖాన్, మరియు సి.ఐ లు, ఎస్.ఐ లు, డిసిఆర్ బి, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## నాటుసారా అమ్ముతూ పట్టుబడిన మహిళ పై కేసు

### జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ లో కేసు నమోదు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 24 (ప్రజామంటలు):** జగిత్యాల అర్బన్ గాంధీనగర్ లో నాటుసారా అమ్ముతూ పట్టుబడిన జూపల్లి రాజవ్వ అనే మహిళ పై జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ లో కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందర ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేశారు. ఆమె బైండోవర్ ని అతిక్రమిస్తూ మరల గుడుంబా అమ్మడంతో ఆమెను ఎక్సైజ్ సిబ్బంది జగిత్యాల అర్బన్ తహసీల్దార్ ముందర హాజరు పరచగా, ఆమెకు 50,000 రూపాయలు జరిమానా విధించగా జరిమానా చెల్లించింది. జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా నాటుసారా తయారు చెయ్యడం, కలిగి ఉండటం, అమ్మడం, రవాణా చెయ్యడం, నాటుసారా తయారీకి ముడిసరుకు రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల అబ్కారీ సీఐ సర్వేష్ తెలియచేశారు.

## పేరుకుపోతున్న చెత్త నిల్వలు

### ప్రమాదంలో ప్రజారోగ్యం



**సికింద్రాబాద్ మే 24 (ప్రజామంటలు):** బన్సీలాల్ పేట డివిజన్ పద్మారావునగర్, అభినవ్ నగర్ కాలనీల్లో రోడ్డు పైన చెత్త నిల్వలు పేరుకుపోతుండటంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. రెగ్యులర్ గా జీహెచ్ఎమ్సీ సిబ్బంది రోడ్లపైన చెత్త కుప్పలను తొలగించకపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు వ్యాపిస్తున్నాయని స్థానిక కాలనీల ప్రజలు వాపోతున్నారు. అలాగే పలు చోట్ల డ్రైనేజీ మురికి నీరు ఉప్పొంగి రోడ్లపై ప్రవహిస్తుండటంతో రహదారులన్నీ అపరిశ్రుభ్రంగా మారుతున్నాయని, జీహెచ్ఎమ్సీ అధికారులు ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ ట్రాన్సపార్మారు పగులకొట్టి కాపర్ వైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు

**ఎల్కతుర్తి మే 23 (ప్రజామంటలు):**



ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన కాకతీయ కెనాల్ పక్కన (వాగు ఒడ్డుకు) ఉన్న వ్యవసాయ విద్యుత్ 25 కె.వి. ట్రాన్సపార్మర్లను గుర్తు తెలియని దొంగలు బుధవారం అర్ధరాత్రి పగుల కొట్టి లోపల వున్న విలువైన కాపర్ తీగలను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్ఫుర్మర్ లో ముప్పై నుండి నుండి నలబై వేల రూపాయల కాపర్ తీగ వుంటుంది. దాదాపు ఏనబై వేల రూపాయల నష్టం చేశారు. ఈమధ్య కాలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. మార్చి నెలలో రెండు ట్రాన్స్ఫుర్మర్ లను ఇలాగే పగులకొట్టి కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎల్కతుర్తి ఏఈ లక్ష్మణ్ నాయక్, లైన్ మెన్, ఏఎల్ఎమ్, జెఎల్ఎమ్ రైతులు నార్లగిరి నర్సింగం, నార్లగిరి మహేందర్ మాట్లాడుతూ.... రెండు నెలల క్రితమే ఈ పక్కనే వున్నా 25 కెవి ట్రాస్ఫర్మర్లు రెండు పగులకొట్టి వైరు ఎత్తుకెళ్లారు. ఇపుడు ఈ ట్రాస్ఫర్మర్ ఎత్తుకెళ్లారు. ట్రాస్ఫర్మర్ దొంగలను పట్టుకోవాలని ఖరీఫ్ సీజన్ మొదలైంది. నారు మడులు దున్నుకున్నామని అవి ఎండిపోతాయి. త్వరగా ట్రాన్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

### ప్రభుత్వ విప్ అడ్లూరీ లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 24 (ప్రజామంటలు):**



ధర్మారం మండలం ఖిల వనపర్తి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్, పెద్దపెల్లి ఎంపి అభ్యర్థి గడ్డం వంశి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి వారి కరుణ కటాక్షాలు ధర్మపురి నియోజక వర్గ ప్రజానీకం పై ఏళ్ల వేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు,ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుండి అన్ని రకాల సహా సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో ప్రదర్శిత మవుతున్న రామాయణం నాటకంలో జరిగిన సీతారాముల కల్యాణం.

## జగిత్యాల పొలాస పరిశోధన స్థానంలో విత్తన మేళా

**భారీగా తరలి వచ్చిన అన్నదాతలు**


**ఒకే బస్తా ఇస్తున్నారంటూ అన్నదాతల ఆవేదన**



**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతులు విత్తనాల సేకరణలో నిమగ్నమవుతున్నారు. జగిత్యాల జిల్లా జయశంకర్ యూనివర్శిటి పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు రూపొందించిన విత్తనాలను రైతులకు అందించేందుకు విత్తన మేళాను నిర్వహించారు.. సమాచారం తెలుసుకున్న అన్నదాతలు కరీంగనర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి భారీగా తరలి వచ్చి వచ్చి క్యూకట్టారు. ఫౌండేషన్ బ్రీడ్ కావటంతో విత్తనాలు నాణ్యతగా ఉంటుందనే ఆశతో భారీ సంఖ్యలో రైతులు తరలి వచ్చారు. అయితే ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వటంతో గంపెడు ఆశతో వచ్చిన రైతులకు నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఒక బస్తా ఇస్తే ఒక ఎకరానికి మాత్రమే వస్తుందని. కనీసం రెండు బస్తాలైన ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు. అయితే విత్తనాలు కొద్ది మొత్తంలో ఉండటం. ఎక్కువ రైతులు విత్తనాల కోసం రావటంతో ఒక బస్తా మాత్రమే ఇస్తున్నామని ఇదే విత్తనాలు మూడు, నాలుగు పంటలకు కూడా విత్తన తయారీ తయారు చేసుకుని వాడుకోవచ్చని పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## మల్యాల ఎంపీపీగా రవళి ఏకగ్రీవం

**అభినందించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**





**మల్యాల మే 24 (ప్రజామంటలు):** మల్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆగంతపు రవలి ఎంపీపీ ఏకగ్రీవంగా అయినట్లు తెలిపారు. మండలో14 ఎంపీటీసీలు ఉండగా 8 మంది ఎంపీటీసీలు రవళి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 18వ మండల అధ్యక్షురాలుగా ఆగంతపు రవలి ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై రవళి ని మండల అధ్యక్షురాలుగా అభినందించి, శాలువతో సత్కరించారు. అనంతరం ఎంపీపీ రవళి మాట్లాడుతూ మండలంలో అన్ని విధాల అభివృద్ధికి పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని నూతన ఎంపీపీ అన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

## బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై భూకబ్జా కేసు

**బాధితుడి ఫిర్యాదుతో చేవెళ్లలో పలు సెక్షన్ల కింద నమోదు**

**వికారాబాద్,మే24:** భారాస మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భూ కబ్జా చేసి, అనుచరులతో బెదిరించారని సామ దామోదర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు.. జీవన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లి గ్రామంలో సర్వే నెంబరు 32, 35, 36, 38లో 20 ఎకరాల 20గుంటల భూమిని సామ దామోదర్‌రెడ్డి కొనుగోలు చేశారు. అతని తండ్రి పరమ్‌రెడ్డి పేరుతో ఫంక్షన్ హాల్ నిర్మించారు. 2023లో జీవన్‌రెడ్డి, అతని అనుచరులు ఫంక్షన్ హాల్ కూల్చివేసి మరో భవనం నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలిసి అక్కడకు వెళ్లిన తమను బెదిరించారని, బిహార్, పంజాబ్‌కి చెందిన గ్యాంగ్‌ను వాచ్‌మెన్‌లుగా పెట్టుకున్నారని తెలిపారు. రెండ్రోజుల క్రితం తమ భూమిలోకి వెళితే.. మారణాయుధాలతో బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి తన భూమిని కబ్జా చేశారని చేవెళ్ల పీఎస్‌లో దామోదర్ రెడ్డి అనే వ్యక్తి శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎర్లపల్లిలో 20 ఎకరాల 20 గుంటల భూమిని 2022లో కొనుగోలు చేశానని బాధితుడు చెబుతున్నాడు. అయితే సర్వేనెంబర్ 32, 35, 36, 38లో ఓ ఫంక్షన్ హాల్‌ను గతంలో నిర్మించుకున్నానని, తన భూమి పక్కనే జీవన్ రెడ్డి భూమి ఉందని చెప్పాడు.

# జమ్మికుంట కాంగ్రెస్ క్యాడర్‌లో విభేధాలు

**నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ బాబుకి వ్యతిరేకంగా సమావేశం**



**జమ్మికుంట మే 24 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ విస్మరిస్తూ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ ఎస్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఇందుశ్రీ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు మీడియా మాట్లాడుతూ కష్టనష్టాలకు ఓర్చుకొని కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులను కాంగ్రెసు పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఉపఎన్నికలలో ఎన్ఎస్ యుఐ నాయకులు బల్మూరు వెంకట్ కు అధిష్టానం హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్లె అభ్యర్థిగా టికెట్ ఇస్తే గెలుపు కోసం కష్టపడ్డామని గుర్తు చేశారు. వెంకట్ ఓటమి పాలైన కాని నియోజకవర్గంలో పర్యటిస్తూ శుభకార్యాలకు, అశుభ కార్యాలయాలకు హాజరై తనవంతు సహాయాన్ని అందిందిస్తూ పార్టి బలోపేతానికి ఇంటికి ఒక కార్యకర్తను తయారు చేసారని చెప్పారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వొడితల ప్రణవ్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం టికెట్ ఇస్తే అతని గెలుపు కోసం కార్యకర్తల అహర్నిశలు కృషి చేశామని చెప్పారు. ఆ కృషి ఫలితమే అధిక ఓట్లు వచ్చి ప్రత్యర్థి పై స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన విషయాన్ని గుర్తు చేశారు. అధిక ఓట్లు రావడానికి కాంగ్రెస్ పార్టీ బలపడటానికి బల్మూరి వెంకట్ బలగం సీనియర్ కార్యకర్తలు కారణమని చెప్పారు. పార్టి బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన సీనియర్ నాయకులను ప్రణవ్ విస్మరిస్తూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ ఎస్ నాయకులకు అందలం ఎక్కిస్తున్నా రని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమికి కారకులైన బీఆర్ ఎస్ పార్టీ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్పిస్తూ కరడు గట్టిన కాంగ్రెస్ కార్యకర్తలను విస్మరిస్తూ మనోభావాలను దెబ్బతీసేలా ప్రణవ్ ప్రవర్తిస్తున్నారని అన్నారు. పార్టీలో పనిచేస్తూ జెండాలు మొస్తే కార్యకర్తల భాద ఏమిటో తెలుసేదని అన్నారు. సీనియర్ నాయకులను, కార్యకర్తలను విస్మరిస్తున్నారని అధిష్టానానికి తెలిసేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమములోజమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మెటి సమ్మిరెడ్డి, జమ్మికుంట కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ వెంకన్న, హుజురాబాద్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ సలీం పాషా, హమాలీ వర్కర్స్ ప్రెసిడెంట్ వొల్లాల శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ సలీమ్, అయోధ్య గౌడ్, మారేపల్లి శ్రీనివాస్, వాసాల రామస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న ను భారీ మెజార్టీతో గెలిపించండి

**తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా జేఏసీ చైర్మన్ కస్తూరి రవి**



**హనుమకొండ మే 24 (ప్రజామంటలు):** ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న ను గెలిపించాలని ప్రవేటు ఉద్యోగుల జేఏసీ తరఫున పట్టభద్రులందరూ ఈనెల 27వ తేదీన జరిగే (ఎమ్మెల్సీ) ఎన్నికలలో భాగంగా పట్టభద్రులందరూ రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కోరుతూ గత ప్రభుత్వం హయాంలో నిరుద్యోగులు పడ్డ కష్టాలు అంతా ఇంత కాదని వారు పడ్డ కష్టం మరెవరికి రావద్దని గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూపు 1, 2, 3 రాసిన ప్రతి ఒక్క నిరుద్యోగి చావు అంచుల దాక వెళ్లి బ్రతికారని వారు గుర్తు చేశారు. గత ప్రభుత్వం వారి అధికారాన్ని కాపాడుకోవడానికి మాత్రమే గ్రూపు ఎగ్జామ్ పెట్టారని ఎగ్జామ్ రాసిన ప్రవళిక చనిపోతే కనీసం మానవత్వంతో చాటి మనిషిగా గుర్తించలేక లవ్ ఎఫైర్ తో చనిపోయిందని పబ్బం గడిపారే తప్ప వారి యొక్క కుటుంబానికి భరోసా ఇవ్వకుండా చనిపోయిన కొంతమంది నిరుద్యోగులకు కనీసం ఎలాంటి ఎక్స్గ్రేషియా ప్రకటించని ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేస్తుందో బిఆర్ఎస్ పార్టీ ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా సెంటర్లో ఉన్న బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతూ నిరుద్యోగులకు అండగా ఉంటాము అని చెప్పి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాము అని కనీసం ఒక కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా నిరుపేద నిరుద్యోగ యువకులకు అన్యాయం చేస్తూ కులమతాలను రెచ్చగొడుతూ యువతను తప్పుదోవ పట్టిస్తుందే తప్ప కనీసం నిరుద్యోగ యువతకు ఏమి చేస్తే యువత బాగుపడుతుంది అనే ఆలోచనలు లేకుండా అంబానీ అనిల్ లాంటి బడ పెత్తందారులకు కొమ్ముకాస్తూ ఇటు బిఆర్ఎస్ అటు బిజెపి పార్టీలను నమ్మే పరిస్థితిలో పట్టా బద్రులు లేరని వారు అన్నారు ప్రజాపాలనపై నమ్మకంతో బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే తీన్మార్ మల్లన్న ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఆశాభావంతో పట్టభద్రులందరూ ఉన్నారని వారు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన మొదటి రోజు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

**పరీక్షల కన్వీనర్ బి. నారాయణ**



**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** జిల్లాలో ఏర్పాటు చేయబడ్డ 19 పరీక్షా కేంద్రాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర ద్వితీయ భాష పరీక్షలో 1334 మంది విద్యార్థులకు గాను 12 43 మంది విద్యార్థులు హాజరైనారు 91 నుంది విద్యార్థులు గైర్ హాజరైనారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర ద్వితీయ భాష పరీక్షలో 665 మంది విద్యార్థులకు గాను 633 మంది విద్యార్థులు హాజరైనారు 32 మంది విద్యార్థులు గైరా హాజరైనారు. శనివారం జరగబోయే ఇంగ్లీష్ ప్రథమ సంవత్సర పరీక్షకు విద్యార్థులందరు సకాలంలో హాజరు కావాలని ఐదు నిమిషాలు ఆలస్యం అయితే లోనికి అనుమతించ బడరని పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులు ప్రథమ సంవత్సర పరీక్ష వ్రాసేవారు 8 గంటల 30 నిమిషాల వరకు పరీక్షా కేంద్రం చేరుకోవాలని మధ్యాహ్నము ద్వితీయ సంవత్సర పరీక్ష రాసే విద్యార్థులు రెండు గంటల వరకు పరీక్షా కేంద్రాన్ని చేరుకోవాలని వారికి కేటాయించిన సీట్ లో కూర్చోవాలని తమ వెంట మొబైల్ ఫోన్ కానీ క్యాలిక్యులేటర్స్ కానీ ఇతర ఎలక్ట్రానిక్ డివైసెస్ తీసుకొని రాకూడదని మరియు ఎలాంటి ప్రింటెడ్ మెటీరియల్ తమ వెంట తీసుకొని రాకూడదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎవరు కూడా ఆందోళన చెందకూడదని ఆందోళన చెందే విద్యార్థులు టెలి మానస్ 14416కు ఫోన్ చేసి ఆందోళన తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు.

# జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు ఆమోదించడంపట్ల కేబినెట్‌కు ధన్యవాదాలు

**జెడ్పి ఫ్లోర్ లీడర్ , బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్**



**చిగురుమామిడి మే 24 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా ప్రకటించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటి బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్నకు గుర్తుగా రాష్ట్ర కెబినెట్ ఆమోదం తెలుపడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ లతో పాటు కేబినెట్ కు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పి ఫ్లోర్ లీడర్ మరియు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అనన్య సామాన్యమైన తెగువకు తెగింపుకు మారు పేరుగా, మొక్కవోణీ ధైర్యశాలిగా, వెట్టి చాకిరీ విముక్తి కోసం, బానిస బ్రతుకుల బాగుకోసం పాపన్న ఉద్యమించిన తీరు తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి దాయకమన్నారు. బహుజన రాజ్యాధికారం కోసం కుల వృత్తుల వారితో స్వంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని మొగులాయిలపై గేరిల్లా యుద్ధం చేసి గోల్కొండ ఖిల్లాను ఏలిన బహుజన చక్రవర్తిగా పేరు ప్రఖ్యాతులు గడించిన విప్లవ వీరుడన్నారు. సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయడం మసక బారిన చరిత్రను వెలికి తీసి రాష్ట్రములోని బలహీన వర్గాల ఆత్మ గౌరవం నిలుపుకోవడమేనని, బహుజన వీర యోధులకు గుర్తింపు నివ్వడమేనని అన్నారు. పాపన్న వీర గాధ భవిష్యత్తు తరాలకు, ముఖ్యంగా యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ పత్రికా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘము మండల అధ్యక్షులు శ్రీ రామోజు రాజ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘము నాయకులు తాళ్లపెల్లి తిరుపతి, బీసీ సంఘము యువత విభాగం ప్రధాన కార్యదర్శి గట్టు ప్రశాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో తేలుకాటుకు విద్యార్థి మృతి



**ఎల్కతుర్తి మే 23 ప్రజా మంటలు**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో తేలుకుట్టి 9వ తరగతి విద్యార్థి శ్యామ్ సింగ్ మృతి.తడిసిన వడ్లు బండపై ఆరేస్తుండగా సంఘటన చోటుచేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# కృంగిన మేడిగడ్డ పిల్లర్ వద్ద భారీ బుంగ

**- బయటపడుతున్న ఇంజనీరింగ్ లోపాలు - రేడియం గేట్ల ఎత్తివేతతో భారీ శబ్దాలు**

**మహదేవపూర్ మే 24 (ప్రజామంటలు):** మేడిగడ్డ బ్యారేజీ లోని 7వ బ్లాక్ లోని 16వ గేటును ఎత్తుతున్న సమయంలో భారీ శబ్దాలు వెలువడటంతో పాటు పిల్లర్ల క్రింద భారీ బొరియ ఏర్పడినట్లుగా గుర్తించారు. అధికారులు మరమ్మతులు చేపడుతున్న సమయంలో అనేక ఇంజనీరింగ్ లోపాలు బయటపడుతున్నాయి. గోదావరి వరద నీటిని స్వేచ్ఛగా వదిలి వేయడానికి అడ్డుగా ఉన్న ఏడవ బ్లాక్ లోని గేట్లను అధికారులు పైకెత్తే ప్రయత్నాలు సాగిస్తున్నారు. టన్నుల కొద్ది బరువున్న ఈ భారీ గేట్లను ఎత్తే క్రమంలో భారీ శబ్దాలు ఏర్పడుతుండటంతో పాటు పియర్లు కృంగుబాటుకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో బ్యారేజీ స్ట్రక్చర్ మరింతగా దెబ్బతినే అవకాశాలున్నాయి. జియో ఫిజికల్, జియో టెక్నికల్ టెస్టుల తర్వాతనే గేట్లు ఎత్తే ప్రక్రియను చేపట్టాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఏడవ బ్లాక్ పియర్ల కింద భారీగా బొరియ ఏర్పడినట్టు అనుమానాలు వ్యక్తపరుస్తున్న ఇంజనీరింగ్ అధికారులు. భారీ వరద పోటును ఎదుర్కొన్నందున బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి 12వేల నుంచి 15వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడినట్లు గతంలో నిర్వహించిన జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షల ద్వారా అంచనాకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. టన్నుల కొద్ది బరువు ఉండే గేటును



పైకి ఎత్తే క్రమంలో పునాదులపై ఒత్తిడి ఏర్పడి బ్యారేజీ


పిల్లర్లు మరింత కుంగే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. గ్రౌటింగ్ ద్వారా బొరియలను పూడ్చి వేశాకే గేట్లను పైకెత్తే పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఏడవ బ్లాక్ లో పిల్లర్లు కుంగిన తర్వాత లీకేజీలు ఆపడానికి 40 వేల ఇసుక బస్తాలను వేశారు.గత ఏడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే ఏడవ బ్లాక్ లోని 15 ను 22వ నంబర్ వరకు గేట్లు స్థానభ్రంశం పొంది బిగిసుపోయిన సంగతి విధితమే.కాళేశ్వరం ప్రాజెక్టు లోని లోపాలపై నేషనల్ డ్యా సేఫ్టీ అథారిటీ ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ బ్యారేజీలను పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇటీవల మధ్యంతర నివేదిక సమర్పించింది. 2019 జూలై నెలలో వచ్చిన వరదల సమయంలో బ్యారేజీ ప్రమాద సంకేతాలను తెలిపిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. పగుళ్లు ఏర్పడిన19, 20, 21 పియర్స్ మధ్య ఉన్న గేట్లను జాగ్రత్తగా పైకి ఎత్తాలని స్పష్టం చేసింది. నీటిపారుదల శాఖ అధికారులు మరియు నిర్మాణ సంస్థ ఎల్అండ్టి సిబ్బందితో కలిసి ఈనెల 17న 15వ నెంబర్ గేటును పైకి ఎత్తారు. బుధవారం నాడు 16వ నంబర్ గేటు ఎత్తడానికి ప్రయత్నించగా భారీ శబ్దాలు ప్రకంపనలు ఏర్పడ్డాయి. ఇదే ప్రదేశంలో బొరియ ఏర్పడి నీరు ఉబికి వస్తున్నట్లు గమనించారు. మేడిగడ్డ బ్యారేజీ కింది భాగంలో ఏర్పడిన బొరియలు ఎంత మేరకు ఉన్నాయో ఒక స్పష్టత వచ్చాకే నిపుణుల కమిటీ సూచన మేరకు ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని బొరియల్లోకి పంపించి పూడ్చివేయాలని భావిస్తున్నారు. దీంతో ఈ వర్షాకాలంలో వచ్చే భారీ వరదలకు బ్యారేజీ తట్టుకునే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ శబ్దాలను, ప్రకంపనలను గుర్తించి అలర్ట్ చేయడానికి సెన్సార్లను ఏర్పాటు చేసుకొని పనులు సాగిస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ లో మొత్తం ఎనిమిది బ్లాకులు ఉండగా అందులో 85 గేట్ల గుండా నీరు స్వేచ్ఛగా ప్రవహించే విధంగా నిర్మాణ పనులు సాగిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటుతో బిగుసుకుపోయిన గేట్లను ఎత్తే పనులను సాగిస్తున్నారు.

## చిరు విశ్వంభరలోకి
# ఆషికా రంగనాథ్



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం విశ్వంభర సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో త్రిష ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా మరో భామ విశ్వంభర టీంతో జాయిన్ అయింది. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర టీంతో ఆషికా రంగనాథ్ ప్రయాణం మొదలుపెట్టబోతుంది. బ్లాక్ బస్టర్ ఎక్స్‌పీరియన్స్ కోసం సిద్దంగా ఉండండి.. అంటూ ఆషికా రంగనాథ్‌కు స్వాగతం పలుకుతూ షేర్ చేసిన లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఏడాది నా సామి రంగ చిత్రంలో నాగార్జునకు జోడీగా మెరిసింది ఆషికా రంగనాథ్. మరి ఈ భామ విశ్వంభరలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. తాజా అప్‌డేట్‌తో మెగాస్టార్ జెట్ స్పీడులో సినిమా పూర్తి చేసేలా ఉన్నాడని ఫుల్ ఖుషీ అవుతున్నారు చిరంజీవి అభిమానులు, మూవీ లవర్స్. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఆర్ఆర్ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ మూవీని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్.

# రోహిత్ శెట్టి..సింగం అగెయిన్



రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ సినిమాలకు బాక్సాఫీస్ వద్ద సూపర్ క్రేజ్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే ఫ్రాంచైజీలో వస్తున్న తాజా చిత్రం సింగం అగెయిన్. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కశ్మీర్‌లో కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్ సందర్భంగా కశ్మీర్‌లో సహస్ర సీమా బల్ జవాన్లతో అజయ్ దేవ్‌గన్, రోహిత్ శెట్టి టీం దిగిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.తాజాగా సింగం మరోసారి ఆన్‌డ్యూటీలో అంటూ.. అజయ్ దేవ్‌గన్ షూటింగ్ లొకేషన్‌లో దిగిన స్టిల్ ఒకటి నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. బాజీరావు సింహం.. ఎస్ఎస్‌పీ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ జమ్మూ / కశ్మీర్ పోలీస్..జీతిని త్వరలో వస్తుందని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ట్వీట్ చేసింది. సింగం అగెయిన్ మరో బ్లాక్ బస్టర్‌గా రికార్డులు క్రియేట్ చేయడం పక్కా అని అజయ్ దేవ్‌గన్ తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. సింగం ఫ్రాంఛైజీలో వస్తున్న మూడో పార్టు ఇది.ఈ మూవీలో రన్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, కరీనాకపూర్, దీపికాపదుకొనే, అజయ దేవ్‌గన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. దీపికాపదుకొనే పోలీసాఫీసర్ గెటప్‌లో యాక్షన్ మూడ్‌లోకి వెళ్లిన స్టిల్ ఒకటి ఇప్పటికే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. రోహిత్ శెట్టి ఇండియన్ పోలీస్ ఫోర్స్ ప్రాజెక్ట్‌తో డిజిటల్ వరల్డ్‌లోకి కూడా అడుగుపెట్టాడు. సిద్దార్థ్ మల్హోత్రా, శిల్పాశెట్టి, వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్ జనవరి 19న ప్రైమ్ వీడియోలో రిలీజైంది.

# కృతిసనన్ పదేళ్ల సినీ ప్రయాణం



బాలీవుడ్‌లో తన తొలి సినిమా విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నటి కృతి సనన్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. బాలీవుడ్ చిత్రంతో 'హీరో పంటీ'తో కృతీ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత బీటౌన్‌లో వరుస సినిమాలు చేస్తున్నారు. తన పదేళ్ల కెరీర్‌ను గుర్తు చేసుకుంటూ పోస్ట్ పెట్టారు. హిందీ పరిశ్రమకు వచ్చి 10 ఏళ్లు గడిచాయంటే నమ్మలేకపోతున్నా. నిన్ననే మొదటిసారి సెట్‌లోకి అడుగుపెట్టానేమో అనిపిస్తుంది. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. మంచి స్నేహితులను, మరిచిపోలేని జ్ఞాపకాలు సొంతం చేసుకున్నా. నా ప్రయాణంలో భాగమై నన్ను ఆదరించిన అందరికీ, నన్ను నమ్మి ప్రోత్సహించిన దర్శకనిర్మాతలకు ఫ్యాన్స్ కు కృతజ్ఞతలు. పెద్ద కలలు కనాలి. వాటిని నిజం చేసుకునేందుకు కృషి చేయాలి. నేనూ అదే చేశాను. నా ప్రయాణంలో మరెన్నో అద్భుతాలు చూడాలనుకుంటున్నా అని రాశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పాత్రల గురించి కృతి మాట్లాడుతూ సవాల్‌తో కూడిన పాత్రలంటే తనకు ఇష్టమని అన్నారు. రోజూ కొత్తగా ప్రయత్నించే అవకాశమున్న ఇండస్ట్రీలో ఉన్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని.. ఇక్కడికి రావాలి, కలలు కనేవారికి స్ఫూర్తిగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కృతి 'దో పత్తీ'తో బిజీగా ఉన్నారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిలిమ్స్' పతాకంపై ఆమె నిర్మించనున్న తొలి చిత్రమిది.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇండియాకు అవార్డు




77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇండియాకు అవార్డు దక్కింది. మైసూరుకు చెందిన ఫిల్మ్‌మేకర్ చిదానంద ఎస్ నాయక్‌ను అవార్డు వరించింది. సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్స్ టు నో అనే ఫిల్మ్‌కు లా సినెఫ్ అవార్డు దక్కింది. పూణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో టెలివిజన్ వింగ్‌లో ఆయన ఏడాది కోర్సు చేశారు. దానిలో భాగంగా తీసిన సన్‌ఫ్లవర్స్ చిత్రానికి ఆ అవార్డు దక్కింది. కన్నడ జానపదులకు చెందిన ఓ మహిళ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. లా సినెఫ్ మూడవ బహుమతి కూడా భారతీయులకే దక్కింది. బన్నీవుడ్ అనే యానిమేషన్ చిత్రం తీసిన భారతీయ సంతతి మహిళ మాన్సీ మహేశ్వరిని అవార్డు వరించింది. మీరట్‌లో మహేశ్వరి జన్మించారు. ఎన్ఐఎఫ్‌టీ ఢిల్లీలో ఆమె విద్యాభ్యాసం చేశారు. యూకేలోని నేషనల్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ స్కూల్లో కూడా ఆమె చదివారు. లా సినెఫ్ అవార్డుల్లో రెండో ప్రైజ్‌ను కొలంబియా యూనివర్సిటీ డైరెక్టర్ ఆస్యా సెగలోవిచ్‌కు దక్కింది.ఫస్ట్ ప్రైజ్ గెలిచిన వారికి 15000 యూరోలు గ్రాంట్ ఇస్తారు. రెండో ప్రైజ్ విన్నర్‌కు 11,250 యూరోలు, మూడవ ప్రైజ్ విన్నర్‌కు 7500 యూరోలు దక్కుతాయి. అవార్డు దక్కిన సినిమాలను జూన్ 3వ తేదీన సినిమా డు పాంథియన్ థియేటర్‌లో స్క్రీన్ చేస్తారు. గడిచిన అయిదేళ్లలో లా సినెఫ్ అవార్డుల్లో ఇండియాకు ఫస్ట్ ప్రైజ్ దక్కడం ఇది రెండో సారి. 2020లో ఎఫ్‌టీఐఐకి చెందిన అస్మితా గుహ నియోగికి అవార్డు దక్కింది. ఆమె క్యాట్ డాగ్ అనే చిత్రాన్ని తీశారు.

# ఆర్సీబీ మేనేజ్మెంట్‌పై ఒత్తిడి చేయండి

## రాయుడు సంచలన కామెంట్స్



టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మరోసారి వివాదస్పద వ్యాఖ్యలు చేశాడు. గత కొన్ని రోజులుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురించి ఘాటు విమర్శలు చేస్తున్న రాయడు తాజాగా సంచలన ట్వీట్‌తో వివాదాన్ని ముదిరేలా చేశాడు. ఆటగాళ్ల పేర్లను ప్రస్తావించకుండా పరోక్షంగా దారుణంగా విమర్శించాడు. అసలేం జరిగిదంటే.. ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సీఎస్కేపై ఆర్సీబీ ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో చెన్నై ఇంటికి, బెంగళూరు ముందుకు వెళ్లింది. అయితే మ్యాచ్ అనంతరం ఆర్సీబీ ఆటగాళ్లు, అభిమానులు సంబరాలు చేసుకున్న తీరుపై రాయుడు వ్యంగ్యంగా మాట్లాడాడు. అప్పుడే ఆర్సీబీ టైటిల్ సాధించినట్లుగా ఫీల్ అవుతుందని అన్నాడు. అయితే ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరు ఓటమిపాలైంది. దీంతో రాయుడు ఆర్సీబీని మరోసారి విమర్శించాడు. సంబరాలు, దూకుడుగా ఉంటే కప్ ఇవ్వరని, సీఎస్కేపై గెలిస్తే ట్రోఫీ సాధించనట్లు కాదని రాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం ఒకే విజయంతో టోర్నీ నుంచి నిష్క్రమణ దాదాపు ఖరారైన స్థితి నుంచి ఆర్సీబీ గొప్పగా పోరాడి వరుసగా ఆరు విజయాలు సాధించింది. బలమైన సీఎస్కే జట్టుపై గెలిచి తదుపరి దశకు చేరింది. టైటిల్ మిస్ అయినప్పటికీ, ఆర్సీబీ అసాధారణ ప్రదర్శనను కొనియాడుతూ వెస్టిండీస్ క్రికెటర్ నికోలస్ పూరన్ పోస్ట్ చేశాడు. కానీ సీఎస్కే ప్లేయర్లు తుషార్ దేశ్‌పాండే, దీపక్ చాహర్, మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆర్సీబీని ట్రోల్ చేయడం గమనార్హం. ఫ్యాన్ వార్‌లా తమ స్థాయికి మించి ప్రవర్తించారని ఈ ఆటగాళ్లపై నెట్టింట్లో విమర్శలు వచ్చాయి. అయితే రాయుడు దానికి వివరణ ఇస్తున్నట్లుగా చేసిన తాజా ట్వీట్ వివాదం సద్దుమణిగేలా కాకుండా రెట్టింపు చేసేలా ఉంది.''ఎన్నో ఏళ్లుగా ఆర్సీబీని సపోర్ట్ చేస్తున్న అభిమానుల పట్ల నాకెంతో ప్రేమ ఉంది. కానీ టీమ్ మేనేజ్మెంట్, లీడర్స్.. వ్యక్తిగత మైలు రాళ్ల కోసం కాకుండా జట్టు గురించి ఆలోచిస్తే ఇప్పటికీ ఆర్సీబీ ఎన్నో టైటిళ్లు సాధించేది. ఎంతో మంది అద్భుతమైన ఆటగాళ్లు జట్టును వీడారో ఓ సారి గుర్తు చేసుకోండి. జట్టు కోసం ఆడే ఆటగాళ్లను తీసుకు రమ్మని మేనేజ్మెంట్‌పై ఒత్తిడి చేయండి. మెగా వేలం నుంచి కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది'' అని అంబటి రాయుడు ట్వీట్ చేశాడు.

# కోచ్ పదవి కోసం బీసీసీఐ ఎవరినీ సంప్రదించలేదు

## టీమిండియా కొత్త కోచ్‌పై స్పందించిన జై షా

టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం జూన్ చివరితో ముగియనుంది. టీ20 ప్రపంచకప్ 2024 అనంతరం కొత్త కోచ్ బాధ్యతలు చేపడతాడు. అయితే బీసీసీఐ ఆఫర్ ఇస్తున్నా కోచ్ పదవిని చేపట్టడానికి విదేశీ మాజీ క్రికెటర్లు ఆసక్తి చూపించట్లేదని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కోచ్‌గా బాధ్యతలు అందుకున్న తర్వాత కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడపలేమని రికీ పాంటింగ్ పేర్కొన్నాడు. భారత కోచ్‌గా తీవ్ర స్థాయిలో ఒత్తిడి, రాజకీయాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జస్టిన్ లాంగర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీలకు బీసీసీఐ ప్రధాన కార్యదర్శి జై షా కౌంటర్ ఇచ్చారు. టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం బీసీసీఐ ఎవరినీ సంప్రదించలేదని జై షా స్పష్టం చేశారు. 'నేను కానీ, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు ఎవరూ కానీ ఏ ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్‌ను సంప్రదించలేదు. మీడియాలో వస్తున్న వార్తలన్నీ అవాస్తవం. హెడ్ కోచ్‌గా సరైన వ్యక్తినే ఎంపిక చేస్తాం. అదంతా ఓ ప్రణాళిక ప్రకారంగా జరుగుతుంది. భారత క్రికెట్ స్వరూపాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న వారి కోసం చూస్తున్నాం. అద్భుత నైపుణ్యంతో జట్టును ఉన్నత శిఖరాలకు చేర్చే వారినే ఎంపిక చేస్తాం. దేశవాళీ క్రికెట్ గురించి పూర్తిగా తెలిసిన వారిని తీసుకొనేందుకు మొగ్గు చూపిస్తాం' అని జై షా స్పష్టం చేశారు.టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం మే 27 దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు. ఇప్పటి వరకు ఎవరు అప్లై చేశారనేది ఇంకా తెలియరాలేదు. చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వైపే బీసీసీఐ ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏడాదిలో పది నెలల పాటు భారత జట్టుతో ఉండటమే అతడికి ఇబ్బందిగా ఉందని సమాచారం. ఈ విషయంలో ఫ్లెమింగ్‌ను ఒప్పించే బాధ్యతను ఎంఎస్ ధోనీపై బీసీసీఐ పెట్టినట్లు వార్తలు వచ్చాయి. టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ పేరు కూడా రేసులో ఉందట. తాను దరఖాస్తు చేయడం లేదని రికీ పాంటింగ్ ఇప్పటికే వెల్లడించాడు. జస్టిన్ లాంగర్ ఈ భారాన్ని మోయలేనని చేతులెత్తేశాడు. జై షా వ్యాఖ్యలను బట్టి భారత నుంచే కోచ్ ఉంటాడని స్పష్టమవుతోంది.

# పాక్ జర్నలిస్ట్ నోరు మూయించిన రైనా!



టీమిండియా మాజీ క్రికెటర్, వరల్డ్ కప్ విన్నర్ సురేశ్ రైనాను ఓ పాకిస్థాన్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ ఎక్స్ వేదికగా ట్రోల్ చేశాడు. దీనికి రైనా తనదైన శైలిలో బదులిచ్చాడు. అదిరిపోయే సమాధానంతో సదరు పాక్ జర్నలిస్ట్ నోరు మూయించాడు. ప్రస్తుతం ఈ ట్వీట్స్ సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారాయి. సురేశ్ రైనా సమయస్ఫూర్తికి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన అనంతరం సురేశ్ రైనా కామెంటేటర్‌గా తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. హిందీ వ్యాఖ్యానంతో అభిమానులను అలరిస్తున్నాడు. తనదైన ఛలోక్తులతో పాటు సీఎస్‌కే మాజీ ఆటగాడిగా.. ధోనీ సన్నిహితుడిగా తన జ్ఞాపకాలను పంచుకుంటున్నాడు. కామెంట్రీలో ఆరితేరిన సురేశ్ రైనాను ఓ మ్యాచ్ సందర్భంగా ఆకాశ్ చోప్రా రిటైర్మెంట్‌పై పునరాచోలన చేస్తావా? అని ప్రశ్నించాడు. దానికి రైనా.. యూటర్న్ తీసుకునేందుకు తాను ఏమైనా షాహిద్ అఫ్రిదినా? అని ప్రశ్నించాడు. షాహిద్ అఫ్రిది తన కెరీర్‌లో చాలా సార్లు రిటైర్మెంట్‌పై యూటర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలోనే అఫ్రిది పేరు చెప్పి రైనా నవ్వులు పూయించాడు. ఇక రైనా కామెంట్స్‌ను మనసులో పెట్టుకున్న పాకిస్థాన్ స్పోర్ట్స్ కంటెంట్ రైటర్ ఇమ్రాన్ సిద్ధిఖ్ అదును కోసం ఎదురు చూసి.. రైనాను ట్రోల్ చేశాడు. ఇటీవల షాహిది అఫ్రిదిని ఐసీసీ.. టీ20 ప్రపంచకప్‌కు ప్రచారకర్తగా ఎంపిక చేసింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సురేశ్ రైనాను ఇమ్రాన్ ఎగతాళి చేసే ప్రయత్నం చేశాడు. 'షాహిద్ అఫ్రిదిని ఐసీసీ.. టీ20 ప్రపంచకప్ అంబాసిడర్‌గా ప్రకటించింది. హలో సురేశ్ రైనా ఇప్పుడు ఏం అంటావ్?'అని ట్వీట్ చేశాడు. ఇందుకు సురేశ్ రైనా దిమ్మదిరిగే సమాధానం ఇచ్చాడు. 'నేనం ఐసీసీ ప్రచారకర్తను కాదు. కానీ 2011 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిని. మోహాలీలో మేం ఆడిన మ్యాచ్ గుర్తుందా? నాకు తెలిసి ఆ మ్యాచ్ నీకు మరిచిపోలేని జ్ఞాపకాలను గుర్తు చేస్తుందనుకుంటా?' అని నోరు మూయించాడు. 2011 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో షాహిద్ అఫ్రిది సారథ్యంలోని పాకిస్థాన్‌ను భారత్ 29 పరుగుల తేడాతో ఓడించి ఫైనల్ చేరింది. ఈ మ్యాచ్‌లో సురేశ్ రైనా 36 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 ప్రపంచకప్ 2024కు ఐసీసీ షాహిద్ అఫ్రిది, యువరాజ్ సింగ్, క్రిస్ గేల్‌తో పాటు ఉసెన్ బోల్ట్‌లను ఐసీసీ ప్రచారకర్తలుగా ప్రకటించింది.

# డీకే నీకు ఎప్పటికీ రుణపడి ఉంటా



టీమిండియా వెటరన్ వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2024 సీజన్ ఎలిమినేటర్ మ్యాచ్ అనంతరం డీకే రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఈ సందర్భంగా బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. కార్తిక్‌ను ఓదార్చిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాజాగా డీకేతో తనకున్న అనుబంధంపై కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను తొలిసారి డీకేను కలిసిన సందర్భంగా ఇంకా గుర్తుందన్నాడు. సమస్యను ఎలా అధిగమించాలనేదానిపై అవగాహన కల్పించాడని, ఆ అమూల్యమైన సలహాకు ఎప్పటికీ రుణపడి ఉంటా అని విరాట్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ మాట్లాడుతూ%ౌ% 'నేను తొలిసారి దినేష్ కార్తిక్‌ను కలిసిన సందర్భంగా ఇంకా గుర్తుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఇద్దరం ఆడాం. 2009 ఛాంపియన్స్ ట్రోఫీ అది. డీకేతో కలిసి మొదటిసారి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకున్నా. 'కార్తీక్ చాలా సరదాగా ఉంటాడు. అయితే హైపర్ యాక్టివ్. కన్‌ఫ్యూజ్డ్ పర్సన్ కూడా. ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు' డీకేపై నాకు కలిగిన తొలి ఇంప్రెషన్ ఇదే. డీకే అద్భుతమైన ప్రతిభావంతుడు. అప్పటికీ ఇప్పటికీ అతడిలో ఏ మార్పులేదు. మైదానం వెలుపల అతడి సంభాషణలు ఆసక్తికరంగా ఉంటాయి. చాలా విషయాలపై మంచి నాలెడ్జ్ ఉంటుంది. క్రికెటేతర అంశాల గురించీ చెబుతాడు' అని తెలిపాడు. 'ఐపీఎల్ 2022 సీజన్ నాకు గొప్పగా ఏమీ లేదు. ఆత్మవిశ్వాసం విషయంలో చాలా ఇబ్బంది పడ్డా. అప్పుడు డీకే నా పక్కనే కూర్చొని నా సమస్యను వివరించాడు. దాన్ని ఎలా అధిగమించాలనేదానిపై సూచన ఇచ్చాడు. థ్యాంక్యూ డీకే.. నీ సలహాలతో మెరుగ్గా రాణించగలుగుతున్నా. నీకు ఎప్పటికీ అతడికి రుణపడి ఉంటా' అని విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు. ఈ సీజన్‌లో డీకే 15 మ్యాచుల్లో 326 పరుగులు చేశాడు. ప్రపంచకప్ 2024లో చోటు దక్కించుకోవడంలో కుర్రాళ్లకు పోటీదారుగా నిలిచిన డీకే.. వయసురీత్యా అవకాశం అందుకోలేకపోయాడు. 38 ఏళ్ల డీకే ఇప్పటివరకు భారత్ తరఫున 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టీ20లు ఆడాడు.

## ఎమ్మెల్సీ ఎన్నిక రోజు ఉద్యోగులకు స్పెషల్ లీవ్

**ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఉత్తర్వులు**

**హైదరాబాద్,మే24:** ఈనెల 27న ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్దిపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సీఎల్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రైవేటు ఉద్యోగులకు సెలవు ఇవ్వాలని చట్టంలో లేనందున తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు. ప్రైవేటు కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ సిబ్బంది ఓటు వేసేందుకు వీలుగా షిఫ్టులు సర్దుబాటు లేదా ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్ షెడ్యూల్ విడుదల

**జూన్ 27 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాల పక్రియ ప్రారంభం**

**హైదరాబాద్,మే24:** తెలంగాణలో ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసింది. మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల పక్రియ జరగనుంది. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమైన ప్రవేశాల కమిటీ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు.. కౌన్సెలింగ్ పక్రియ ప్రారంభానికి ముందే ఎస్ఎస్‌సీ, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ, ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారం కోసం టీజీఈఏపీసెట్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని తెలిపింది. జూన్ 27 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల పక్రియ ప్రారంభం. జూన్ 30 నుంచి మొదటి విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం. జులై 12న మొదటి విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు. జూలై 19 నుంచి ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్. జులై 24న ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు. జులై 30 నుంచి ఇంజినీరింగ్ తుది విడత కౌన్సెలింగ్. ఆగస్టు 5న తుది విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు. ఇంటర్నల్ స్లైడింగ్ ఆన్‌లైన్‌లో కన్వీనర్ ద్వారా చేపట్టాలని నిర్ణయం. ఆగస్టు 12 నుంచి ఇంటర్నల్ స్లైడింగ్ పక్రియ. ఆగస్టు 16న ఇంటర్నల్ స్లైడింగ్ సీట్ల కేటాయింపు. ఆగస్టు 17న స్పాట్ అడ్మిషన్లకు మార్గదర్శకాలు విడుదల చేస్తామని ప్రకటించింది.

## గనుల శాఖలో అవినీతి చెద

**ఆరుగురు అధికారులపై వేటు**

**హైదరాబాద్,మే24:** తెలంగాణ గనులు, భూగర్భ శాఖలో అవినీతి ఆరోపణలతో ఆరుగురు అధికారులపై ప్రభుత్వం వేటేసింది. గనుల శాఖలో డిప్యుటేషన్ పై జీఎంలుగా పని చేస్తున్న పాండురంగారావు, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, ప్రాజెక్టు ఆఫీసర్స్ దశరథం, తోట శ్రీధర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లను మాతృ సంస్థలకు బదిలీ చేసింది. అధికారుల అవినీతిపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్ రావును అరెస్టు చేయడం కలకలం రేపిన సంగతి తెలిసిందే.. అంతకుముందు ఫోన్ల ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన ప్రణీత్ రావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే అదే కేసులో పోలీసు అధికారులు భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావు అరెస్టయి జైల్లో ఉన్నారు. ఎస్ ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కు రెడ్ కర్నార్ నోటీసులు జారీ కాబోతున్నాయి. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ కేసును తారుమారు చేసేందుకు యత్నించిన పంజాగుట్ట సీఐ దుర్గారావుపై సర్కారు సస్పెన్షన్ వేటు వేసింది. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలించి సంచలన నిర్ణయం తీసుకున్నది. ఠాణా మొత్తాన్ని ట్రాన్స్ ఫర్ చేయడం కలకలం రేపింది.

## కౌటింగ్‌కు అంతా సిద్ధం కావాలి

**శ్రేణులకు పురంధేశ్వరి పిలుపు**



**విజయవాడ,మే24:** జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం వెబెక్స్ వీడియో మాధ్యమం ద్వారా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం కూటమికి అవకాశం ఉందని పలు విశ్లేషణలు తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఓట్ల లెక్కింపు పక్రియ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లు తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కు 500 ఓట్లకు ఒక్కో టేబుల్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కష్టించి పని చేసిన కార్యకర్తలు ఇళ్ళకు వెళ్లి కృతజ్ఞతలు తెలపాలని వెల్లడించారు. ఎన్నికల సమయంలో కూటమిలో ఉన్న సమన్వయం కౌంటింగ్ పక్రియలో కూడా ఉండేలా పనిచేయాలన్నారు. కాగా.. ఏపీలో ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఏపీలో 67.99 పోలింగ్ శాతం నమోదైంది. కౌంటింగ్ కు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీల నాయకులు హడావుడి మొదలు పెట్టారు. కానీ.. పోలింగ్ రోజు ఘర్షణల నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని పలు ప్రాంతాలకు పోలీసులు సూచించారు. రాష్ట్రంలో గెలుపుపై ఎవరి అంచనాలు వారివి. సోషల్ మీడియాలో సర్వేలు వైరల్ అవుతున్నాయి. కూటమి అధికారం సాధిస్తుందని కొందరు.. మళ్లీ వైసీపీ గద్దె ఎక్కడం ఖయమని మరి కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వేలు చూసిన ప్రజలు గంధరగోళానికి గురవుతున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలుసుకోవాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

# కిషన్ రెడ్డి మా బ్రాండ్ అంబాసిడర్

**- బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక జరిగితే సన్మానిస్తా - ఆయనకూ వాజ్‌పేయ్ లాగా మంచి గుణాలు ఉన్నాయి**

**- ప్రధాని మోడీ ఎక్కడికెళితే అక్కడి టోపీ పెట్టేస్తున్నారు - కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్య**

**హైదరాబాద్,మే24:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్‌గా కిషన్‌రెడ్డి మారారని పొగడ్తలు కురింపించారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలను సంతోషంగా స్వాగతిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ పాలన బాగుందని కిషన్ రెడ్డి ఒప్పుకున్నందుకు సంతోషమని ప్రశంసించారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కిషన్ రెడ్డికి వ్యవసాయ శాఖపై ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. ధాన్యం మద్దతు ధర కేంద్రం నిర్ణయిస్తుందనే కనీస అవగాహన కిషన్ రెడ్డికి లేదన్నారు. 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని కిషన్ రెడ్డి అన్నారన్నారు. ప్రభుత్వ పాలన నచ్చే 25 మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కిషన్ రెడ్డి ఒప్పుకున్నారని చెప్పారు. దివంగత ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయ్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వ్యక్తి కిషన్ రెడ్డి అని కొనియాడారు. అధికార పార్టీలు మంచి చేస్తే మెచ్చుకునే గుణం వాజ్‌పేయ్ లాగే కిషన్ రెడ్డికి వచ్చిందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టలేరన్నారు. ఎన్ని ప్రయోగాలు చేసిన బీజేపీకి తెలంగాణలో స్థానం లేదన్నారు. మోదీ ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రం బట్టలు, టోపీలు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని జగ్గారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ కు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతున్నారని చెప్పినందుకు కిషన్ రెడ్డి మాటలు స్వాగతిస్తున్నామని.. అదే జరిగితే సన్మానిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు. కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ ఐనట్టున్నారు. ఐదేళ్లు సీఎం రేవంత్.. కాంగ్రెస్ ప్రభుత్వం సేఫ్. ప్రభుత్వాలను పడగొట్టే దాంట్లో బీజేపీ నేతలు ప్రొఫెసర్లు. తెలంగాణ లో బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా పడగొట్టే అవకాశం లేదు. బీజేపీ మళ్ళీ కేంద్రంలో అధికారంలోకి రాదని తేలిపోయింది. అందుకే రోజుకో భాషా.. రోజుకో వేషం మారుస్తున్నారు. అటల్ బీహార్ వాజ్ పాయ్ దారిలో నడుస్తున్నట్టు



కనిపించింది. మంచి పని చేస్తే.. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రశంసించే గుణం వాజ్‌పాయ్ ది. నిండు పార్లమెంట్ లో ఇందిరాగాంధీని దుర్గమాతతో పోల్చారు. 25 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతున్నారు అంటే.. ఐదు నెలల కాంగ్రెస్ పాలన బాగుందని అర్థం. కాంగ్రెస్.. రాష్ట్రంలో మంచి పాలన ఉందని ప్రశంస మాకు మంచిదేనని ఆయన పేర్కొన్నారు. బీజేపీ లో ఉన్న ఐదుగురిలో కూడా కొందరు బయటకు వస్తారని జగ్గారెడ్డి ఆరోపించారు. రంజాన్ రోజు ముస్లిం లు మా ఇంటికి బిర్యానీ పంపించే వాళ్ళు అని మోడీ చెప్పారు. ప్రభుత్వం రాదని భయం పట్టుకుని మాట్లాడుతున్నారు. వేషం మారింది.. బాషా మారింది. వంగి వంగి దండాలు పెడుతున్నారు మోడీ. కేటీఆర్ ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నరు. కేటీఆర్ మాట్లాడినా.. హరీష్ మాట్లాడినా రేవంత్ మీద బురద జల్లడమే. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మీరు కూడా దందా చేశారా..? మీరు చేశారు కాబట్టి.. మేము కూడా చేస్తాం అనుకుని మాట్లాడుతున్నాడు కేటీఆర్. తెలంగాణలో హత్యా రాజకీయాలు లేవు.. ప్రభుత్వం దాన్ని ప్రోత్సహించదు. కేటీఆర్.. జూపల్లి మీద అభాండాలు వేస్తున్నారు. రాజకీయ విలువల గురించి కేటీఆర్ మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటుందన్నారు.

# మాచర్లలో నిశ్శబ్ద విప్లవం

**- ప్రజలు పిన్నెల్లికి వ్యతిరేకంగా ఓటు**

**- అందుకే ఇవిఎంలను ధ్వంసం చేశారు - టిడిపి నేత వర్ల రామయ్య వెల్లడి**

**అమరావతి,మే24:** మాచర్ల నియోజకవర్గంలో మార్పు మొదలైందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ప్రజల్లో వస్తోన్న మార్పును చూసి పోలింగ్ జరిగే రోజున ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ఈవీఎం పగులగొట్టారని ఆరోపించారు.

పిన్నెల్లి అహంకారాన్ని మాచర్ల ప్రజలు నిశ్శబ్ద విప్లవంతో అణిచివేశారని వివరించారు. నియోజకవర్గంలో పిన్నెల్లిని ప్రజలు తిరస్కరించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. జనం నాడీ తెలిసినందునే పిన్నెల్లి అరాచకానికి పూనుకున్నారు.'మాచర్ల నియోజకవర్గం సున్నితమైన ప్రాంతం. ఇక్కడ కేంద్ర బలగాలను మోహరించాలి. ఏం జరిగిందో తెలియదు.. ఇక్కడ రాష్ట్ర పోలీసులు విధుల్లో ఉన్నారు. ఒకవేళ కేంద్ర బలగాలు డ్యూటీ చేస్తే పరిస్థితి మరోలా ఉండేది. ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లిని అక్కడికక్కడే కాల్చి పారేసే వారు. లేదంటే రెక్కలు విరిచి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లే వారు. సున్నిత ప్రాంతం అని తెలిసినప్పటికీ అక్కడ కేంద్ర బలగాలు ఎందుకు విధుల్లో లేరు..? ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం వల్ల జరిగిందా... లేదంటే పోలీసు అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిందా..? పిన్నెల్లి ప్రోద్భలంతో నియమించలేదా అని' వర్ల రామయ్య సూటిగా ప్రశ్నించారు.'మాచర్లలో కేంద్ర బలగాలను ఎన్ని బూత్‌ల వద్ద నియమించారు. ఎక్కడ వారి సేవలు వినియోగించారు. మాచర్ల పోలీసులు సమాధానం చెప్పాలి. పిన్నెల్లి పవిత్రుడని, ఏ నేరం చేయని అమాయకుడని, సీఎం జగన్ రెడ్డికి ఇష్టమైన వాడని ఈవీఎం బద్దలు కొట్టాడని సజ్జల బుకాయిస్తున్నాడు. ఎందుకు మీ మేకపోతు గాంభీర్యం. మాచర్లలో నిశ్శబ్ద విప్లవం వచ్చింది. ఆ విప్లవమే పిన్నెల్లి అరాచకాలను పాతిపెట్టింది. రాష్ట్రంలోని 174 నియోజకవర్గాల్లో నిశ్శబ్ద విప్లవం వచ్చింది. సీఎం జగన్ అరాచక సామ్రాజ్యాన్ని కూల దోయనుంది. పిన్నెల్లి పగలగొట్టిన ఈవీఎం బాక్సులో కింద పడిన ఓట్లర్ స్లిప్పులో ఆ విషయం స్పష్టమైంది. అందులో టీడీపీకి 22 ఓట్లు, 6 ఓట్లు వైసీపీకి పడ్డాయి. అందుకే కావచ్చు పిన్నెల్లి విధ్వంసానికి తెరలేపాడు అని' వర్ల రామయ్య తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఐఏఎస్‌కు రాష్ట్ర కేడర్ ఆఫీసర్ల ఎంపిక సరికాదు

**కోడ్ ముగిసిన తరవాతే చేపడితే మంచిది**

**యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీకి బాబు లేఖ**

**అమరావతి,మే24:** యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం లేఖ రాశారు. ఐఏఎస్‌కు రాష్ట్ర కేడర్ ఆఫీసర్ల ఎంపిక కార్యక్రమాన్ని మోడల్ కోడ్ ఉన్నప్పుడు చేయడం సముచితం కాదని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చే వరకు నియమించొద్దని యూపీఎస్సీని చంద్రబాబు కోరారు. వారి ప్రమోషన్స్ ముఖ్యమంత్రి కార్యాలయంలోని వారికే పరిమితం చేశారన్నారు. ఇప్పుడు కూడా జాబితా తయారీలో పారదర్శకత లేదని అన్నారు. ఈ అంశాన్ని పునః పరిశీలించాలని యూపీఎస్సీ చైర్మన్‌ను చంద్రబాబు నాయుడు కోరారు. అయితే ఏపీ సార్వత్రిక ఎన్నికలు అయిపోయన తర్వాత వైద్య పరీక్షల కోసం చంద్రబాబు అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే.. ఆయనకు ఎదురెళ్లి టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు అడ్డుకున్నారు. అయితే ఆ తర్వాత అతనిపై పిన్నెల్లి, అతని అనుచరులు గొడ్డళ్లతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు.

# నర్సింగ్ విద్యార్థిని మృతి కేసు

**ఎమ్మెల్యే తెల్లం బాలరాజును నిలదీసిన బాధితులు**



**భద్రాచలం,మే24:** భద్రాచలంలో నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య అనుమానాస్పద మృతి ఉద్రిక్తతకు దారి తీసింది. విద్యార్థిని మరణానికి నిరసనగా కాలేజీ ఎదుట ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని.. నర్సింగ్ కాలేజీని సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఈ క్రమంలో కాలేజీకి వద్దకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. యాజమాన్యంతో మాట్లాడారు. అయితే ఎమ్మెల్యేతో బాధిత విద్యార్థిని బంధువులు, విద్యార్థి సంఘాలు వాగ్వాదానికి దిగాయి. నిందితుల తరఫున వచ్చారా అని నిలదీశారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కారుణ్య బంధువులకు సర్దిచెప్పేందుకు ఎంత ప్రయత్నించినప్పటికీ వినిపించు కోలేదు. దీంతో విసుగుచెందిన ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో పగిడిపల్లి కారుణ్య (17) బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నది. గురువారం తెల్లవారుజామున 3:40 గంటలకు ఓ విద్యార్థిని బాత్‌రూం వెళ్లేందుకు బయటకు రాగా కారుణ్య కళాశాల ఆవరణలో రక్తపు గాయాలతో పడి ఉన్న విషయాన్ని గమనించి తోటి విద్యార్థినులతో కలిసి హాస్టల్ వా÷-డ్గ÷న్‌కు తెలిపింది. వెంటనే 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 8.30 గంటలకు మృతి చెందినట్టు ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. దవాఖాన వద్ద కారుణ్య తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగగా గిరిజన, దళితసంఘాల నాయకులు మద్దతు పలికారు. భద్రాచలం ఏఎస్పీ దవాఖాన వద్దకు వచ్చి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా కారుణ్య శరీరంపై గాయాలు ఉండటంతో విద్యార్థిని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై దాడి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం కాలేజీ వద్దకు చేరుకున్న మృతురాలి బంధువులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

## ఎపిలో కౌంటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ

**పెరిగిన పోస్టల్ బ్యాలెట్లతో జనం తీర్పుపై చర్చ**

**అమరావతి,మే24:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న క్రమంలో కౌంటింగ్‌పై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇసి ఇప్పటికే కట్టుదిట్టమైన చర్యలకు ఆదేశించింది. తరవాతనే మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. పలు చోట్ల వైసీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. పోలింగ్ రోజున రాత్రి వరకు పోలింగ్ జరిగింది. దీంతోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా భారీగా పెరిగాయి. దీంతో జనం తీర్పు ఏ విధంగా ఉండనుందో అనే అంశం ఉత్కంఠ రేపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 5 లక్షల 39 వేల 189 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. జూన్ 4వ తేదీన ఆయా జిల్లాల్లో ఎన్ని టేబుల్స్ వేసి లెక్కించాలనే అంశంపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 38 వేల 865 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా.. తర్వాత స్థానంలో నంద్యాల జిల్లా ఉంది. ఇక్కడ 25 వేల 283 పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు వేశారు. మూడో స్థానంలో కడప జిల్లా నిలిచింది. ఇక్కడ 24 వేల 918 పోస్టల్ బ్యాలెట్లు పడ్డాయి. అత్యల్పంగా నరసాపురంలో 15 వేల 320 పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు పోల్ అయ్యాయి.పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల వివరాలు జిల్లాల వారీగా వచ్చాయి. దాంతో జిల్లాల్లో ఎన్ని టేబుల్స్ ఏర్పాటు చేయాలి..? ఒక్కో టేబుల్‌లో ఎన్ని లెక్కించాలని అనే అంశంపై రిటర్నింగ్ అధికారులకు కేంద్ర ఎన్నికల కమిషన్ సమాచారం ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి ఎన్నికల సంఘానికి తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. రిటర్నింగ్ అధికారి సీల్, సంతకం లేకున్నా పరిగణలోకి తీసుకోవాలని ఈసీని తెలుగుదేశం పార్టీ కోరింది. ఇందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనా మౌఖికంగా అంగీకారం తెలిపారు. దానికి సంబంధించి లిఖితపూర్వకంగా ఉత్తర్వులు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ కోరింది.డిక్లరేషన్‌పై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేసిన సీల్ లేకపోయినా పరిగణలోకి తీసుకోవాలని కోరుతుంది.

## తెలంగాణ అవతరణ వేడుకలకు ఇసి అనుమతి

**ఘనంగా దశాబ్ది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు**

**అధికారులతో సమీక్షించి సూచనలు చేసిన సిఎస్**



**హైదరాబాద్,మే24:** తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. ఈసీ నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధశాఖల అధికారులను ఆదేశించారు. దశాబ్ది వేడుకలు కావడంతో ధూమ్‌ధామ్‌గా చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో తెలంగాణ ఉద్యమకారులను సిఎం రేవంత్ సన్మించే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఈసీ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వడంతో, అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ నున్నట్లు తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com